తెలంగాణ
TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 06 - మే - 2025 | సంపుటి : 2 | సంచిక : 345 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## ప్రధాని మోదీకి పుతిన్ ఫోన్.. యుద్ధానికి ఫుల్ సపోర్ట్..


పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిని పుతిన్ ఖండించారు. ఉగ్రదాడిలో మృతి చెందిన 26 మంది అమాయక ప్రజలకు నివాళి అర్పించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఉగ్రవాదాన్ని ఏరివేయడంలో తమ సహకారం ఎప్పుడూ భారత్ కు ఉంటుందని ప్రధాని మోదీకి పుతిన్ హామీ ఇచ్చారు.



వివరాలు 2లో..

## పాక్‌పై భారత్ కఠిన చర్యలు.. రెండు హైడ్రో పవర్ ప్రాజెక్టుల పనులు

పహల్గాం ఉగ్రదాడికి భారత్ సైలెంట్‌గా ప్రతీకార చర్యలు మొదలుపెట్టింది. ఇప్పటికే బాగ్‌లిహార్ డ్యామ్ నీటిని ఆపేయగా.. తాజాగా సలాల్ డ్యామ్‌ను కూడా మూసివేసింది. అంతేకాదు.. ఈ రెండు హైడ్రోపవర్ ప్రాజెక్టుల రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన పనులు మొదలుపెట్టినట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ కథనం వెలువరించింది.



వివరాలు 2లో..

## విదేశీ సినిమాలపై 100% సుంకం

### ట్రంప్ సంచలన ప్రకటన..

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)



రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ తీసుకుంటోన్న నిర్ణయాలపై. అటు ప్రపంచ దేశాల నుంచే కాదు.. అమెరికన్ల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన 100 రోజుల పాలనపై అప్పుడే జనాల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ప్రతీకార సుంకాలతో వాణిజ్య యుద్ధానికి తెరతీసిన ఆయన.. విదేశాల్లో నిర్మితమయ్యే సినిమాలపై 100% సుంకం విధిస్తూ సంచలన ప్రకటన చేశారు. అమెరికా సినిమా పరిశ్రమను కాపాడటానికి, జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇది వాణిజ్య యుద్ధంలో భాగమని, అమెరికాలో సినిమాలు తీయాలనే నినాదంతో ఆయన ముందుకు సాగుతున్నారు. రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. భాగస్వామ్య దేశాలపై ప్రతీకార సుంకాలతో విరుచుకుపడిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీశారు. ఈ క్రమంలో ఆయన మరో సంచలన ప్రకటన చేశారు. విదేశాల్లో నిర్మితమైన అన్ని సినిమాలపై 100 శాతం సుంకం విధించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తన స్వంత సోషల్ మీడియా వేదిక అయిన ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్ చేశారు. ''అమెరికా సినిమా పరిశ్రమ వేగంగా కుప్పకూలుతోంది... ఇతర దేశాలు మన చిత్ర నిర్మాణ సంస్థలను తమవైపు ఆకర్షించేందుకు భారీ ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ఇది కేవలం వ్యాపార పోటీ కాదు.. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన విషయం. విదేశీ సినిమాలు ప్రాపగండా (ప్రచార ఆయుధం)గా ఉపయోగించుకుంటున్నాయి' అంటూ ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## మీ సమరం తెలంగాణ ప్రజలపైనా?



- ఉద్యోగాలిచ్చి జీతాలిస్తున్న ప్రజలపై యుద్ధం ప్రకటిస్తారా?
- ఉద్యోగ సంఘాల నాయకులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం
- తనను కోసినా రూపాయి రాదని.. ఎక్కడా అప్పు పుట్టడం లేదని స్పష్టీకరణ
- నన్ను కోసుకొని వండుకొని తింటారా అంటూ తీవ్ర వ్యాఖ్యలు
- అప్పుల కుప్పచేసి ఫామ్‌హౌస్‌లో దుప్పటి కప్పుకొని పడుకున్నాడని కేసీఆర్‌పై విమర్శలు
- ఉద్యోగుల సమ్మె ప్రకటనలపై పోలీస్ అవార్డుల కార్యక్రమంలో విరుచుకుపడ్డ సీఎం
- పార్టీల ఉచ్చులో పడొద్దని హితవు.. చర్చలకొస్తే లెక్కలు చెప్తానని వెల్లడి
- శాంతిభద్రతలు బాగున్నందునే పెట్టుబడులొస్తున్నాయని పోలీసులకు కితాబు

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

ఎవరి మీద సమరం చేస్తారు? ఎవరిని నిందించదల్చుకున్నరు? ఎవరిని కొట్టదల్చుకున్నరు? ఉద్యోగా లిచ్చి జీతాలు ఇస్తున్న ప్రజలపైనా మీ యుద్ధం? ప్రజలకు జవాబుదారీగా ఉంటూ వారికి కష్టాలు వస్తే ఆదుకోవాల్సిన వాళ్లు.. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సహకరించాల్సిన ఉద్యోగ సంఘాల నాయకులు సమరం ప్రకటిస్తున్నారు. ఆ సంఘాల నాయకులను అడుగుతున్నా. ప్రజలకు మంచి చేసేందుకే ఇక్కడ ఉన్నాం. సమరం చేయడానికి లేము. ప్రజలపై యుద్ధం చేసిన వాళ్లెవరూ బాగుపడలేదు' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగ సంఘాల నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన 'తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్ జీ అవార్డులు' కార్యక్రమానికి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విధి నిర్వహణలో ప్రతిభ చూపిన 22 మంది పోలీస్ సిబ్బంది, అధికారులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు.

మిగతా 2లో..

## ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది..

- ఈ దశలో సమ్మె చేయొద్దు: మంత్రి పొన్నం
- ఆర్టీసీ సిబ్బంది సమ్మె చేస్తే ప్రజలకు ఇబ్బందులు
- సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎప్పుడైనా సిద్ధం

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నదని, సమస్యలు తగ్గుతున్నాయని, ఇలాంటి దశలో సమ్మె చేయవద్దని ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ సిబ్బంది సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారని చెప్పారు. సమస్యలను ఎప్పుడైనా ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చని, వినడానికి సీఎం, తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆర్టీసీ సంఘాల నేతలు మంత్రిని కలిశారు.

మిగతా 2లో..





## ఇరు దేశాలు సంయమనం పాటించాలి: ఐరాస సూచన

(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)

భారత్, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలపై ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయని, గతంలో ఎన్నడూ లేనంతగా ఉన్నాయని తెలిపారు. ఘర్షణ అదుపుతప్పే అవకాశం కూడా ఉందని హెచ్చరించారు. ఇరు దేశాలు ఏ పొరపాటు చేయొద్దని, సైనిక చర్య పరిష్కారం కాదని సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు దేశాలు సంయమనం పాటించి, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలి. 'పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ఆమోదయోగ్యం కాదు. బాధ్యులను చట్టబద్ధమైన మార్గాల ద్వారా శిక్షించాలి. భారత్ పాక్ దేశాలు సంయమనం పాటించాలని, ఈ ప్రాంతంలో శాంతి నెలకొల్పడానికి రెండు దేశాలు వెనక్కి తగ్గాలని కోరారు. ఇరు దేశాల సంబంధాలు ఈ దశకు చేరుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. దౌత్యం, శాంతి పునరుద్ధరణకు తీసుకునే ఏ చొరవకైనా మద్దతు ఇవ్వడానికి ఐక్యరాజ్యసమితి సిద్ధంగా ఉందన్నారు.

## తెలంగాణలో రూ. 2 లక్షల కోట్ల హైవే ప్రాజెక్టులు

### ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని గడ్కరీ ధీమా



- గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే హైవే ప్రాజెక్టుల పురోగతి
- యువతకు ఉపాధి అవకాశాలు మరియు రవాణా సౌకర్యం మెరుగుపడటం
- పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండటం
- ఎలక్ట్రిక్ మరియు CNG వాహనాల ప్రోత్సాహం
- తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రామాణిక ప్రణాళిక
- జిల్లా స్థాయిలో నూతన ప్రాజెక్టుల ప్రగతి ..
- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అభివృద్ధి..
- నితిన్ గడ్కరీ ముఖ్యమైన అభివృద్ధి ప్రణాళికలు

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

రాబోయే మూడు, నాలుగేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో సుమారు రూ. 2 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం ప్రకటించారు. ఈ భారీ ప్రాజెక్టులతో తెలంగాణ రూపురేఖలు సంపూర్ణంగా మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రూ. 3,900 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు రూ. లక్ష కోట్ల విలువైన కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే హైవే ప్రాజెక్టుల పనులు చురుకుగా సాగుతున్నాయని గడ్కరీ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పుంజుకుంటుందని, యువతకు ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని, రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు.

మిగతా 3లో..

## వాట్సాప్ వైద్యానికి కవలలు బలి!

- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో విజయలక్ష్మి ఆసుపత్రిలో చోటుచేసుకున్న దారుణ ఘటన
- 7 ఏండ్ల తర్వాత గర్భం దాల్చిన కీర్తికి 5 నెలల గర్భంతో వైద్య చికిత్స
- డాక్టర్ అనూష రెడ్డి వైద్య నిర్లక్ష్యం
- వైద్య వ్యవస్థలో తలెత్తిన నిర్లక్ష్యం
- న్యాయం కోసం కుటుంబ సభ్యులు డిమాండ్



వివరాలు 2లో..

## రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భూకంపం..

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలోని పలు జిల్లాల్లో స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రకంపనలు కాస్త ఎక్కువగా నమోదవటంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. రిక్టర్ స్కేలుపై 3.8గా భూకంప తీవ్రత నమోదైంది. గతంలో సంభవించిన భూప్రకంపనల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. తెలంగాణలో మరోసారి భూమి కంపించింది. సోమవారం (మే 05న) రోజున ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో స్వల్పంగా భూమి కంపించింది. భూప్రకంపనలు వచ్చిన ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ముఖ్యంగా.. కరీంనగర్ జిల్లాలోని గంగాధర, చొప్పదండి, రామడుగు, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ తదితర మండలాల్లో భూమి 2 సెకన్ల పాటు కంపించింది. మొదట ఉరుములు అనుకున్నప్పటికీ, భూమి కదలడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు.

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మీ సమరం తెలంగాణ ప్రజలపైనా?

(మొదటి పేజీ తరువాయి)

'ప్రభుత్వం అంటే నేను ఒక్కడినే కాదు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు అంతా కలిస్తేనే ప్రభుత్వం. మనం పాలకులం కాదు.. సేవకులం. రాజకీయ పార్టీల చేతుల్లో పావులుగా మారవద్దని ఉద్యోగులకు నేను విజ్ఞప్తి చేస్తున్నా. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని.. ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని.. ప్రభుత్వం సాఫీగా నడవొద్దని కొన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఉంటది.

మీరు వాళ్ల ఉచ్చులో పడి వాళ్ల చేతుల్లో పావులుగా మారొద్దు. రాజకీయ నాయకుల చేతుల్లో చురకత్తుల్లా మారి ప్రజల గుండెల్లో గుచ్చితే అది గాయంగా మారుతుంది తప్ప ప్రయోజనం ఉండదు. నన్ను కోసినా ఒక్క రూపాయి కూడా రాదు. నెలకు రూ. 18,500 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం లేదు. వాస్తవ పరిస్థితి ఇది. మరి నన్ను ఏం చేస్తరు? నన్ను కోసుకొని వండుకొని తింటరా?'అని ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

'ఉద్యోగుల జీతాలు, ఫించన్లు, ఇతర సంక్షేమ కార్యక్రమాలకు ప్రతి నెలా రూ. 22,500 కోట్లు కావాలి. ప్రభుత్వానికి వస్తున్న రూ. 18,500 కోట్లలో ప్రతి నెలా అప్పులకు రూ. 7 వేల కోట్లు, ఉద్యోగుల వేతనాలు, పింఛన్లకు రూ. 5,500 కోట్లు పోను నా దగ్గర మిగిలేవి రూ. 6 వేల కోట్లు. దీనిలో ఏయే పథకాలు అమలు చేయాలి? అవకాశం ఉన్న ప్రతి దగ్గర ఖర్చులు తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నా. సీఎం హోదాలో ఎక్కడికి పోయినా ప్రత్యేక విమానం తీసుకెళ్లే వెలుసుబాటు ఉన్నా మామూలు విమానాల్లో ఎకానమీ క్లాస్‌లో సాధారణ ప్రయాణికులతో కలిసే వెళ్తున్నా. దుబారా తగ్గిస్తున్నా'అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

'మీ కోరికలు తీర్చాలంటే ఏం చేయాలి? కావాలంటే నేనే బహిరంగ సభ ఏర్పాటు చేస్తా. 10 లక్షల మందిని కూడా తీసుకొస్తా. ఇట్లా చేస్తే బాగుంటదని సభలో మీ ఉద్యోగుల సంఘాల నాయకులే మాట్లాడండి. ఏ పథకం ఆపాలో మీరే ప్రజలకు చెప్పండి. ఫలానా పథకం ఆపేసి మేం జీతాలు పెంచుకుంటాం. బోనస్‌లు తీసుకుంటాం. మేం తిన్నాక మిగిలిందే మీకు ఇస్తామని ప్రజలకు చెప్పండి. లేదంటే రూ. 100 ఉన్న పెట్రోల్ రూ. 200 చేద్దామా? బియ్యం, పప్పు, ఉప్పు, చింతపండు ధరలు రెండింతలు చేద్దామా? మీరే చెప్పండి.

ధరలు పెంచకుండా ఉన్న పథకాలను ఆపకుండా కొత్త కోరికలు నెరవేరవు. నిరసనలు, ధర్నాలు, బంద్‌లు చేస్తే ఉన్న వ్యవస్థ కూడా కుప్పకూలుతుంది. నాకు పోయేది కూడా ఏమీ లేదు. చిన్న గ్రామం నుంచి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడమే ప్రజలు నాకిచ్చిన గొప్ప గౌరవం అనుకుంటా. ఆ గౌరవం బతికి ఉన్నంత కాలం ఈ గౌరవం నిలబెట్టేందుకు పనిచేస్తా'అని సీఎం రేవంత్ చెప్పారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లో తెచ్చిన అప్పు రూ. 1.58 లక్షల కోట్లు. అందులో రూ. 1.52 లక్షల కోట్లు పాత అప్పులు, అసలు, మిత్తికి చెల్లించాం. గత ప్రభుత్వం మొత్తం రూ. 8.29 లక్షల కోట్ల బకాయిలు పెట్టిపోయింది. మేం తెచ్చిన అప్పులో సొమ్మంతా పాత బకాయిలకు పోయింది తప్ప ఏ సంక్షేమ కార్యక్రమాలు చేయలేకపోయాం. ఈ 16 నెలల్లో సరాసరిన నెలకు రూ. 9 వేల కోట్లు చెల్లించుకుంటూ వస్తున్నా.

ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్లు ఇవ్వాల్సి వస్తుందనే గత ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసు మూడేళ్లు పెంచింది. ఇప్పుడు రిటైరవుతున్న వాళ్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ల కింద రూ. 8,500 కోట్ల బకాయిలు చెల్లించాలి. వాటిని ఒకవైపు క్రమబద్ధీకరిస్తూనే సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నాం. అదనంగా ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రూ. 500 బోనస్, రూ. 500కే గ్యాస్ సిలిండర్లు, పేదల ఇళ్లకు 250 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 16 నెలల్లో కేవలం రైతులకే రూ. 30 వేల కోట్లను వాళ్ల ఖాతాల్లోకి బదిలీ చేశా'అని సీఎం పేర్కొన్నారు.

'రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదు. అప్పు పుడతలేదు. బ్యాంకర్లను కలిసేందుకు వెళ్తే తెలంగాణ ప్రతినిధులను దొంగల్లా చూస్తున్నరు. ఢిల్లీకి పోతే అపాయింట్‌మెంట్ కూడా ఇస్తలేరు. దేశం ముందు తెలంగాణది ఆ పరిస్థితి ఉంది. కుటుంబ పరువు తీయొద్దని కుటుంబ పెద్దగా నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నా. ప్రభుత్వ లెక్కలు కావాలంటే ఆర్థికశాఖ అధికారుల వద్ద కూర్చొని చూడండి'అని సీఎం రేవంత్ ఉద్యోగ సంఘాల నేతలకు సూచించారు.

'డైలీ ఫైనాన్స్‌లో రూ. 10 మిత్తికి తెచ్చుకొనే వాడికంటే అధ్వానంగా అప్పులు తెచ్చిపెట్టిండు ఆయన (మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి). రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి మీ సావు మీరు సావండని హ్యాపీగా ఫాంహౌస్‌లో దుప్పటి కప్పుకొని పడుకుండు. మూడు నెలలకొకసారి బయటికి వచ్చి అది ఫెయిల్.. ఇది ఫెయిల్ అని తిడతడు. రైతుబంధు ఫెయిల్ అని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని చెప్పేటప్పుడు బాధతో కాదు.. ఆయన ముఖం వెయ్యి వోల్టుల బల్బులా వెలుగుతది. ఇదేం పైశాచిక ఆనందం?'అని సీఎం రేవంత్ మండిపడ్డారు.

నిమిషం నిర్లక్ష్యంగా ఉన్నా పోలీస్ శాఖకు చెడ్డపేరు..

'శాంతిభద్రతలు బాగుంటేనే అభివృద్ధి సాధ్యం. శాంతిభద్రతలు బాగున్నందునే 16 నెలల్లో రూ. 2.28 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించగలిగాం. దీనంతటికీ కారణం పోలీస్ శాఖ అని నేను గర్వంగా చెబుతున్నా. విధుల్లో ఒక్క నిమిషం నిర్లక్ష్యం చేసినా మొత్తం పోలీస్ వ్యవస్థకే చెడ్డపేరు వస్తుంది. డ్రగ్స్ ముఠాలపై ఉక్కుపాదం మోపి అణచివేయాలి, సైబర్ నేరాలను నియంత్రించాలి.

పోలీస్‌శాఖకు అవసరమైన పూర్తి సహకారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది'అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ హైదరాబాద్ సహా నగరాల్లో పోలీసులు చేపడుతున్న డ్రగ్స్ కట్టడి గ్రామీణ ప్రాంతాల్లోనూ పక్కాగా కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఎస్ రామకృష్ణారావు, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డీజీపీ జితేందర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, పలువురు సీనియర్ ఐపీఎస్‌లు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీకి పుతిన్ ఫోన్..
# యుద్ధానికి ఫుల్ సపోర్ట్..


(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిని పుతిన్ ఖండించారు. ఉగ్రదాడిలో మృతి చెందిన 26 మంది అమాయక ప్రజలకు నివాళి అర్పించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఉగ్రవాదాన్ని ఏరివేయడంలో తమ సహకారం ఎప్పుడూ భారత్ కు ఉంటుందని ప్రధాని మోదీకి పుతిన్ హామీ ఇచ్చారు.

ఇలాంటి ఘటనలకు పాల్పడిన ఉగ్రమూకలను చట్టం ముందు నిలబెట్టేందుకు తమ మద్దతు భారత్ కు ఉంటుందని పుతిన్ పేర్కొన్నారు. ఈ మేరకు భారత్ రష్యా మధ్య సంబంధాలు మరింత దృఢంగా మారేందుకు గల అంశాలపై పుతిన్, ప్రధాని మోదీ చర్చించారు. ఈ క్రమంలో 80వ విక్టరీ డే సందర్భంగా ప్రధాని మోదీ పుతిన్ కు శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాక భవిష్యత్తులో భారత్ లో నిర్వహించనున్న వార్షిక సదస్సుకు పుతిన్ ను ఆహ్వానించారు ప్రధాని మోదీ. అంతకుముందు భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. రష్యా విదేశాంగ ప్రతినిధి సర్గీ లావ్రోవ్ తో ఫోన్ లో సంభాషించారు. పహల్గాం దాడి తర్వాత భారత్ పాకిస్థాన్ దేశాల మధ్య నెలకొన్న పరిస్థితులను లావ్రోవ్ కు వివరించారు. కలిసికట్టుగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలని నిర్ణయానికి వచ్చారు.

ఇక పాకిస్థాన్ పై ప్రతీకారం ఎలా తీర్చుకోవాలన్న దానిపై భారత ప్రధాని నరేంద్ర మోదీ వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. అధికార వర్గాలతో ప్రధాని మోదీ.. భేటీ అవుతుండటం తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. తాజాగా వైమానిక దళం చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశం అయ్యారు. పలు కీలక విషయాలు చర్చించారు.

ఇప్పటికే ప్రధాని మోదీ త్రివిధ దళాలతో సమావేశం అయ్యారు. వాళ్లకు ఫుల్ పవర్స్ ఇచ్చారు. టైమ్, డేట్ మీరే ఫిక్స్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. పాకిస్థాన్ కు ఎలాంటి జవాబు ఇవ్వాలో సైన్యమే నిర్ణయిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. మరోవైపు సింధూ జలాల రద్దుతోపాటు, వీసాల జారీ రద్దు, అటారీ వాఘా బోర్డర్ మూసివేత కారణంగా పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది.



# ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది..



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆర్టీసీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీ సమస్యలపై, ఆర్టీసీ సంక్షేమం కోరే ఎవరైనా నేడు, రేపు ఎప్పుడైనా కలిసి సమస్యలు చెప్పవచ్చని, తాను ఎప్పుడూ అందుబాటులోనే ఉంటానన్నారు. ఆర్టీసీ సమస్యలు వినడానికి ముఖ్యమంత్రి కార్యాలయం తలుపులు కూడా ఎప్పుడూ తెరిచే ఉంటాయని చెప్పారు.

ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం.. ఈ మూడింటికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. సంస్థ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నది. సమస్యలు తొలుగుతున్నాయి. సమ్మె చేయవద్దని ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్న. మీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి, వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంటా. ఆర్టీసీకి 16 నెలలుగా ఎన్నో మంచి కార్యక్రమాలు చేశాం. ఒక్కటైన ఇబ్బంది పెట్టామా. ఆర్టీసీ సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడతారని మంత్రి అన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు 2013 నుంచి చెల్లించాల్సిన బాండ్ మొత్తం రూ.400 కోట్లు చెల్లించామని తెలిపారు. 2017 పే స్కేల్ 21 శాతం ఇచ్చామని గుర్తుచేశారు. దీనివల్ల సంవత్సరానికి రూ.412 కోట్లు భారం పడుతుంది. పీఎఫ్ ఆర్గనైజేషన్‌లో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.1039 కోట్లు చెల్లించాం. నెలవారీ పీఎఫ్ కంట్రిబ్యూషన్ 2024 జనవరి క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీఎస్ బకాయిలు ఉద్యోగులకు రూ.345 కోట్లు చెల్లించాం. నెలవారీ సీసీఎస్ కంట్రిబ్యూషన్ గతేడాది జనవరి నుండి క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. 1500 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చాం. ఆర్టీసీలో 3038 మంది ఉద్యోగులను నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కొత్త బస్సులు కొనుగోలు చేశాం, తార్నాక దవాఖానను సూపర్ స్పెషాలిటీగా మార్చామని వెల్లడించారు.

మంత్రితో భేటీ అయినవారిలో ఆర్టీసీ జేఏసి చైర్మన్, టీఎంయూ జనరల్ సెక్రెటరీ అశ్వర్థామ రెడ్డి, ఎన్ఎంయూ జనరల్ సెక్రెటరీ నరేందర్, కార్మిక సంఘ్ జనరల్ సెక్రెటరీ ఎర్ర స్వామి కుమార్, ఎస్‌టీఎంయూ జనరల్ సెక్రెటరీ పున్న హరి కృష్ణ, పలువురు ఆర్టీసీ సంఘాల నేతలు ఉన్నారు.

# పాక్‌పై భారత్ కఠిన చర్యలు.. రెండు హైడ్రో పవర్ ప్రాజెక్టుల పనులు

(ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు)



పహల్గాం ఉగ్రదాడికి భారత్ సైలెంట్‌గా ప్రతీకార చర్యలు మొదలుపెట్టింది. ఇప్పటికే బాగ్లిహార్ డ్యామ్ నీటిని ఆపేయగా.. తాజాగా సలాల్ డ్యామ్‌ను కూడా మూసివేసింది. అంతేకాదు.. ఈ రెండు హైడ్రోపవర్ ప్రాజెక్టుల రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన పనులు మొదలుపెట్టినట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ కథనం వెలువరించింది. ఇప్పటికే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో.. దీనికి సంబంధించిన సమాచారాన్ని పాక్‌కు వెల్లడించలేదు. తొలిసారి ఆ ఒప్పందానికి భిన్నంగా భారత్ తీసుకొన్న తొలి చర్యగా నిపుణులు చెబుతున్నారు.

గత గురువారం నుంచి ఒక రిజర్వాయర్‌లో బురదను తొలగించేందుకు ఫ్లషింగ్ ప్రక్రియను మొదలుపెట్టింది. దాదాపు మూడు రోజులపాటు ఇది కొనసాగింది. ఈ పనులను ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌హెచ్‌పీసీ చూసుకొంటోంది. కాకపోతే పాక్‌కు ఇప్పటికిప్పుడు నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయడం సాధ్యం కాకపోయినా.. భవిష్యత్తులో మాత్రం సమస్యలు ఎదురుకావచ్చని నిపుణులు చెబుతున్నారు. సింధు జలాల ఒప్పందం కిందకు వచ్చే నదులపై ఇలాంటివి దాదాపు అరడజను ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిల్లో నిల్వ సామర్థ్యం పెంచితే మాత్రం పాక్‌కు నీటి కరవు తప్పదు. సలాల డ్యామ్‌ను 1987లో.. బాగ్లిహార్‌ను 2009లో ప్రారంభించారు.

ఈ డ్యామ్‌లపై మొదలైన పనుల గురించి, ప్రభుత్వం లేదా ఎన్‌హెచ్‌పీసీ స్పందించడం లేదు. ఇక బురదను, నీటిని బయటకు పంపే ఫ్లషింగ్ ప్రక్రియ కారణంగా విద్యుత్తును మరింత సమర్థవంతంగా ఉత్పత్తి చేసే అవకాశంతో పాటు.. టర్బైన్ దెబ్బతినకుండా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇక సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంతో.. పాక్‌కు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం భారత్‌కు లేదు. మన ప్రాజెక్టుల్లో ఇష్టం వచ్చిన మార్పులు చేసుకోవచ్చని సెంట్రల్ వాటర్ కమిషన్ మాజీ అధిపతి కుష్వీందర్ వోహ్రా పేర్కొన్నారు.

ఇక ఈ ఒప్పందాన్ని భారత్ నిలిపివేస్తే.. ఎదుర్కొనేందుకు పాక్ వద్ద పరిమిత ఆప్షన్లు మాత్రమే ఉన్నాయి. ఈ ఒప్పందానికి మధ్యవర్తి అయిన ప్రపంచ బ్యాంక్ వద్దకు వెళ్లడం తప్ప మిగిలిన వాటి వల్ల దానికి పెద్దగా ప్రయోజనం లేదు. వరల్డ్‌బ్యాంక్‌కు చట్టబద్ధమైన పాత్ర ఏమీ లేదు. అంతేకానీ ఒప్పందాన్ని అమలుచేసే అధికారం లేదు. ఏమైనా అభిప్రాయభేదాలు వస్తే.. చర్చలకు మాత్రమే ప్రోత్సహించగలదు. తటస్థ నిపుణుల నియామకం, కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఛైర్మన్లను నియమించడం వరకే దాని పాత్ర పరిమితం.

## వాట్సాప్ వైద్యానికి
# కవలలు బలి!

- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో విజయలక్ష్మి ఆసుపత్రిలో చోటుచేసుకున్న దారుణ ఘటన
- 7 ఏండ్ల తర్వాత గర్భం దాల్చిన కీర్తికి 5 నెలల గర్భంతో వైద్య చికిత్స
- డాక్టర్ అనూష రెడ్డి వైద్య నిర్లక్ష్యం
- వైద్య వ్యవస్థలో తలెత్తిన నిర్లక్ష్యం
- న్యాయం కోసం కుటుంబ సభ్యులు డిమాండ్



(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

గర్భిణిని నొప్పులతో ఆస్పత్రికి తీసుకొస్తే.. నర్సులు, ఇతరులు వైద్యం చేసి కవల పిల్లలను బయటకు తీశారు. వైద్యం వికటించి కవలలు చనిపోయారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని విజయలక్ష్మి ఆసుపత్రిలో ఈ దారుణం జరిగింది. విజయ లక్ష్మి ఆసుపత్రి డాక్టర్ అనూష రెడ్డి దగ్గర గత 5 నెలలుగా ఎలిమినేడు గ్రామానికి చెందిన బట్టి కీర్తి చికిత్స చేయించుకుంటోంది. పెళ్ళైన 7 ఏండ్ల తర్వాత గర్భం దాల్చింది. కడుపులో కవలలు ఉన్నారని, ఎలాంటి పనులు చేయవద్దని బెడ్ రెస్ట్ ఉండాలని సూచిస్తూ డాక్టర్ కొన్ని కుట్లు వేశారు. కాగా ఆదివారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో గర్భిణీ బట్టి కీర్తికి తీవ్రంగా నొప్పులు రావడంతో బంధువులు మళ్లీ ఆసుపత్రికి తరలించారు. తెల్లవారుజాము నుంచి డాక్టర్ ఆస్పత్రిలో అందుబాటులో లేకుండా, కేవలం సిస్టర్లతో ఫోన్లో, వాట్సాప్లో మాట్లాడుతూ, వీడియో కాల్లో వైద్యం అందించింది. ఉదయం 10.30 గంటలకు 5 నెలల గర్భిణి గర్భసంచి నుంచి కవల పిల్లలను బయటకు తీశారు. తీవ్ర రక్తస్రావం అయ్యింది. ఉదయం 11 గంటలకు వచ్చిన డాక్టర్ కవలలు మరణించారని చెప్పారు. డాక్టర్ అందుబాటులో లేకపోవడం, నిర్లక్ష్యం వల్ల, సిస్టర్లు, సహాయకుల వైద్యం వల్లనే ఇలా జరిగిందని బాధిత కుటుంభ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భూకంపం..

(మొదటి పేజీ తరువాయి)

అలాగే.. జగిత్యాల జిల్లా కేంద్రంలో కూడా భూమి ఒక్కసారిగా కంపించింది. సుమారు 3 సెకన్ల పాటు భూమి కుదుపులకు లోనవడంతో భయంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. జగిత్యాల పట్టణంతో పాటు కోడిమ్యాల, మాల్యాల, రాయికల్ పరిసర గ్రామాల్లో కూడా భూమి కంపించినట్లు సమాచారం అందింది. మరోవైపు.. నిర్మల్ జిల్లాలోనూ భూ ప్రకంపనలు సంభవించాయి. కడెం, జన్నారం, ఖానాపూర్, లక్ష్మణ్‌చాందా మండలాల్లో 2 నుంచి 5 సెకన్లపాటు భూమి కంపించింది. భూకంప లేఖినిపై దీని తీవ్రత 3.8గా నమోదైంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాల్లోనూ స్వల్పంగా భూమి కంపించినట్లు సమాచారం అందుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో సంభవించిన ఈ స్వల్ప భూకంపం ప్రజలను గతంలో సంభవించిన భూ ప్రకంపనలను గుర్తు చేసింది. ముఖ్యంగా 2024 డిసెంబర్ నెలలో ములుగు జిల్లాలోని మేడారం కేంద్రంగా రిక్టర్ స్కేల్‌పై 5.3 తీవ్రతతో సంభవించిన భూకంపం తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లోనూ ప్రకంపనలు కలిగించింది. గోదావరి పరివాహక ప్రాంతంలో దాని ప్రభావం ఎక్కువగా ఉండటంతో ములుగు జిల్లా ఏటూరు నాగారంలో కొన్ని ఇళ్లు దెబ్బతిన్నాయి. గత ఏడాది సంభవించిన



భూకంపం భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోనూ ప్రభావం చూపింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనూ స్వల్పంగా ప్రకంపనలు నమోదయ్యాయి. తాజాగా సంభవించిన ఈ భూకంపాల తీవ్రత తక్కువగా ఉన్నప్పటికీ, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భూకంపాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. భూమి కంపించినప్పుడు ఇంట్లో ఉంటే దృఢమైన టేబుల్ లేదా డెస్క్ కింద ఆశ్రయం తీసుకోవాలి, బయట ఉంటే భవనాలు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని విపత్తు నిర్వహణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. భూకంప తీవ్రత 3.8గా నమోదవడం వల్ల పెద్దగా నష్టం వాటిల్లకపోయినా, ప్రజలు అప్రమత్తంగా ఉండటం మంచిదని అధికారులు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# తెలంగాణలో రూ. 2 లక్షల కోట్ల హైవే ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

రాబోయే మూడు, నాలుగేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో సుమారు రూ. 2 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం ప్రకటించారు. ఈ భారీ ప్రాజెక్టులతో తెలంగాణ రూపురేఖలు సంపూర్ణంగా మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రూ. 3,900 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు రూ. లక్ష కోట్ల విలువైన కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే హైవే ప్రాజెక్టుల పనులు చురుకుగా సాగుతున్నాయని గడ్కరీ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పుంజుకుంటుందని, యువతకు ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని, రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. రద్దీ తగ్గడం, తక్కువ ఖర్చుతో ప్రయాణం సాధ్యపడటం, లాజిస్టిక్స్ సామర్థ్యం పెరగడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని, తద్వారా రాష్ట్ర మౌలిక సదుపాయాల రంగంలో ఇదో కీలక ముందడుగు అవుతుందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని గడ్కరీ స్పష్టం చేశారు.

2014లో తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించే నాటికి తెలంగాణలో జాతీయ రహదారుల పొడవు 2,511 కిలోమీటర్లు ఉండగా, ప్రస్తుతం అది దాదాపు రెట్టింపై 5,000 కిలోమీటర్లకు చేరిందని గడ్కరీ గుర్తుచేశారు. "తెలంగాణలో ఇప్పటికే రూ. 1.5 లక్షల కోట్ల పనులు పూర్తిచేశాం. కానీ ఇది ఆరంభం మాత్రమే. రాబోయే 34 ఏళ్లలో మరో రూ. 2 లక్షల కోట్ల విలువైన పనులు చేపడతాం. ఇవి కచ్చితంగా తెలంగాణ రూపురేఖలను మారుస్తాయని నేను విశ్వసిస్తున్నాను," అని ఆయన అన్నారు. రాష్ట్రంలో చేపట్టిన కొన్ని కీలక గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రాజెక్టుల వివరాలను గడ్కరీ తెలియజేశారు:

ఇండోర్‌హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌వే: రూ. 17,000 కోట్లతో 770 కి.మీ.ల ఈ ప్రాజెక్టులో తెలంగాణ పరిధిలో 136 కి.మీ. ఉంటుంది. రాష్ట్రంలోని పనులకు (రూ. 4,500 కోట్లు) నూరు శాతం అనుమతులు పూర్తయ్యాయని, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల గుండా వెళ్లే ఈ మార్గం మార్చి 2026 నాటికి పూర్తవుతుందని తెలిపారు. దీనివల్ల ఇండోర్‌హైదరాబాద్ ప్రయాణ సమయం 20 గంటల నుంచి 10 గంటలకు తగ్గుతుంది. సూరత్‌చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే: 1,100 కి.మీ.ల ఈ మార్గం తెలంగాణ మీదుగా కూడా వెళ్తుందని, ఇది ఉత్తరదక్షిణాలను కలుపుతూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి కలను నెరవేరుస్తుందని అన్నారు. వచ్చే ఏడాది ఇది పూర్తవుతుందని, తెలంగాణలో 78 కి.మీ. మేర (పొరుగున ఉన్న కర్నూలును కలుపుతూ) ఉంటుందని చెప్పారు. దీని వల్ల సూరత్‌చెన్నై మధ్య దూరం 300 కి.మీ., ప్రయాణ సమయం 28 గంటల నుంచి 17 గంటలకు తగ్గుతుంది. సూర్యాపేటదేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే: హైదరాబాద్‌విశాఖపట్నం కారిడార్‌లో భాగంగా రూ. 8,000 కోట్లతో 221 కి.మీ.ల ఈ ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో 164 కి.మీ. తెలంగాణలోని సూర్యాపేట, ఖమ్మం జిల్లాల గుండా వెళ్తుంది. దీనితో హైదరాబాద్‌విశాఖ ప్రయాణ సమయం 12 గంటల నుంచి 6 గంటలకు తగ్గుతుంది. నాగ్‌పూర్‌విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే: రూ. 16,000 కోట్లతో 565 కి.మీ.ల ఈ ప్రాజెక్టులో 401 కి.మీ. (రూ. 13,328 కోట్లు) తెలంగాణలోనే ఉంటుంది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల మీదుగా వెళ్లే ఈ మార్గం నాగ్‌పూర్‌విజయవాడ మధ్య దూరాన్ని 175 కి.మీ., ప్రయాణ సమయాన్ని 13 గంటల నుంచి 6 గంటలకు తగ్గిస్తుంది. హైదరాబాద్‌పనాజీ కారిడార్: రూ. 20,000 కోట్లతో 563 కి.మీ.ల ఈ ప్రాజెక్టులో 90 కి.మీ. తెలంగాణలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల మీదుగా వెళ్లి జాతీయ రహదారి 44ను కలుస్తుంది. ఇది హైదరాబాద్‌పనాజీ ప్రయాణ సమయాన్ని 15 గంటల నుంచి 7 గంటలకు తగ్గిస్తుంది. వీటితో పాటు భద్రాచలం, బాసర, మేడారం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలను జాతీయ రహదారులతో అనుసంధానించనున్నట్లు తెలిపారు. జగిత్యాలకరీంనగర్ హైవే విస్తరణ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులతో తెలంగాణమహారాష్ట్ర మధ్య రోడ్డు రవాణా మరింత సులభతరం కానుందని అన్నారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్, పక్కనున్న జిల్లాల వెనుకబాటుతనాన్ని ప్రస్తావించిన గడ్కరీ, వాటి అభివృద్ధికి నీరు, విద్యుత్, రవాణా, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో (రైతుల ఆత్మహత్యలు అధికంగా ఉన్న చోట) తాను చేపట్టిన నీటి సంరక్షణ పనులను గుర్తుచేస్తూ, తెలంగాణలోని డ్యామ్‌లు, నీటి వనరుల పూడికను ఉచితంగా తీసి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంలో సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణ, రవాణా ఖర్చు తగ్గింపు లక్ష్యంగా పెట్రోల్ వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. విద్యుత్ వాహనాల వినియోగం పెరిగితే రవాణా ఖర్చు గణనీయంగా తగ్గుతుందని నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో డ్రగ్స్ కంట్రోల్ అధికారుల దాడులు..

## 66 కార్పొరేట్ ఫార్మసీలకు షోకాజ్ నోటీసులు

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ మందుల నియంత్రణ శాఖ రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్పొరేట్ ఆసుపత్రులకు చెందిన అలాగే వాటికి అనుబంధంగా ఉన్న ఫార్మసీలపై దాడులు నిర్వహించింది. కూకట్‌పల్లిలోని ఓ ఆసుపత్రిలో రూ.70,000/ విలువైన మెడికల్ డివైస్ స్టాక్‌ను నిలిపివేయాలని ఆదేశించింది. మొత్తం 66 కార్పొరేట్ ఆసుపత్రులలోని ఫార్మసీలలో అనేక అక్రమాలు బయటపడగా, వీటికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఈ దాడుల్లో ఫార్మసిస్టు లేని మెడికల్ షాప్స్ లలో మందుల విక్రయాలు, విక్రయ బిల్లులను సక్రమంగా నిర్వహించకపోవడం, ప్రిస్క్రిప్షన్ డ్రగ్ రిజిస్టర్లు మరియు షెడ్యూల్ H1 డ్రగ్ రిజిస్టర్లను నిర్వహించకపోవడం, స్టాక్ చేసిన ఔషధాల కొనుగోలు బిల్లులు చూపించకపోవడం, నమోదు చేసిన వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండానే ఔషధాల విక్రయం, కొనుగోలు మరియు విక్రయ బిల్లుల కాపీలు సక్రమంగా లేనివి, తక్కువ ఉష్ణోగ్రతలో నిల్వ చేయాల్సిన ఔషధాలను సరైన పరిస్థితుల్లో నిల్వ చేయకపోవడం, గడువు ముగిసిన ఔషధాలను అమ్మదగిన ఔషధాలతో కలిపి నిల్వ చేయడం గుర్తించారు. వీటిలో కూకట్పల్లి రెమిడీ ఆసుపత్రి, మెదక్ పట్టణం, అహ్మద్ నగర్ కాలనీ లైఫ్ కేర్ ఫార్మసీ, మల్కాజిగిరి గెంకేర్ పాలోమి ఆసుపత్రి ఇలా మొత్తం 66 ఫార్మసీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఔషధ తయారీ (నార్కోటిక్ ఔషధాలు మరియు మానసిక ఉల్లాసకర పదార్థాల ఉత్పత్తి సహా) నివాస, వాణిజ్య, పరిశ్రమ ప్రాంతాల్లో జరుగుతున్న అనుమానాస్పద కార్యకలాపాలు, అలాగే ఇతర అసౌకర్యకరమైన ఔషధాలకు సంబంధించిన ఫిర్యాదులను, తెలంగాణ మందుల నియంత్రణ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 18005996969కు సమాచారం ఇవ్వవచ్చని అధికారులు తెలిపారు. ఈ టోల్ ఫ్రీ నెంబర్ ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 వరకు అందుబాటులో ఉంటుందని చెప్పారు.



## క్రెడిట్ కార్డులు ఎక్కువగా ఎవరు వాడుతున్నారో తెలుసా?




ఒకవైపు క్రెడిట్ కార్డులు ఉపయోగించే యువత సంఖ్య పెరిగింది. మరోవైపు క్రెడిట్ కార్డుల ద్వారా గృహ రుణాలు తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. నేటి యువతరం ఆర్థిక స్వేచ్ఛ మార్గంలో వేగంగా కదులుతోంది. అలాగే వారి కలలను త్వరగా నెరవేర్చుకుంటున్నారు. ఇందులో యువత తమ ఆదాయం కంటే ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తున్నారు. దీనికోసం క్రెడిట్ కార్డులను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. 25 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత క్రెడిట్ కార్డులు, గృహ రుణాలు వంటి క్రెడిట్ ఉత్పత్తులను ఉపయోగించడంలో ఆసక్తి చూపుతున్నారని పైసాబజార్ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. ఈ మార్పు వారి ఆర్థిక ఆలోచనలను ప్రతిబింబించడమే కాకుండా, రుణం సులభంగా లభిస్తుందని కూడా హైలైట్ చేస్తుంది. ఈ ధోరణి వెనుక గల కారణాలను, దాని ప్రభావాలను తెలుసుకుందాం.

పైసాబజార్ అధ్యయనం ప్రకారం.. దీనిలో కోటి కంటే ఎక్కువ మంది కస్టమర్ల క్రెడిట్ నమూనాలను విశ్లేషించారు. 1990లలో జన్మించిన యువకులు 25 నుండి 28 సంవత్సరాల వయస్సులో క్రెడిట్ కార్డులు తీసుకోవడం ప్రారంభిస్తారు. 1960లో జన్మించిన వారిలాగే మునుపటి దశాబ్దాలలో వారు సగటున 47 సంవత్సరాల వయస్సులో వారి మొదటి క్రెడిట్ ఉత్పత్తిని కొనుగోలు చేశారు. నేటి యువత ఆన్‌లైన్ షాపింగ్, ప్రయాణం, భోజనం వంటి ఖర్చుల కోసం క్రెడిట్ కార్డులను ఇష్టపడతారు. ఈ కార్డులు సౌకర్యాన్ని అందించడమే కాకుండా క్యాష్‌బ్యాక్, రివార్డ్ పాయింట్లు, ప్రయాణ ప్రయోజనాలు వంటి ఆకర్షణీయమైన ఆఫర్‌లను కూడా అందిస్తాయి. ఉదాహరణకు, నణఖీజ, ాదీI వంటి బ్యాంకులు యువతను ఆకర్షించడానికి తక్కువ వార్షిక రుసుములతో కార్డులను అందిస్తున్నాయి.

## లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ట్రేడవుతున్నాయి. గడిచిన సెషన్‌తో పోలిస్తే సోమవారం లాభాల బాటపట్టాయి. అంతర్జాతీయ మార్కెట్ సానుకూలంగా ఉండటంతో లాభాలు ఊపందుకున్నాయి. ఈ రోజు ఉదయం 10 గంటల సమయానికి నిఫ్టీ 132 పాయింట్లు పెరిగి 24,478 కు చేరింది. సెన్సెక్స్ 391 పాయింట్లు బలంతో 80,891 వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో సానుకూల ధోరణులు, అంతర్జాతీయ వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం మార్కెట్ సెంటిమెంట్‌కు దోహదపడుతుంది. ఇండియాపాక్ ఉద్రిక్తతలను మార్కెట్ వర్గాలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. దీంతోపాటు అమెరికాచైనా ట్రేడ్‌వార్‌ను మార్కెట్లు గమనిస్తున్నాయి. తగ్గిన చమురు ధరలు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించి, ఆర్థిక వఅద్ధికి తోడ్పడుతున్నాయి. నిఫ్టీ సూచీలో అదానీ పోర్ట్స్, ఏషియన్ పెయింట్స్, టైటాన్ కంపెనీ, శ్రీరామ్ ఫైనాన్స్, ఎంఅండ్‌ఎం షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. కొటక్ మహీంద్రా, ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, లార్సెన్ షేర్లు నష్టాల్లో ఉన్నాయి. ఎలాంటి వార్తలూ లేకపోవడంతో ప్రామాణిక సూచీలు ఈ వారం స్థిరీకరణ దశలోకి వెళ్లవచ్చని విశ్లేషకులు అంచనా వేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు ఏ స్థాయి వరకూ వెళతాయన్న దానిపై స్పష్టత లేకపోవడంతో.. మార్కెట్లు ఒక శ్రేణికి పరిమితం కావొచ్చని వెల్లడిరచారు. మే 67 తేదీల్లో జరిగే అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశాలపై మదుపర్లు దృష్టిపెట్టారు. అమెరికా డాలర్ ఇండెక్స్ 99.67 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 59.06 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.3 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో గతంతో పోలిస్తే లాభాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 1.47 శాతం లాభపడిరది. నాస్‌డాక్ 1.51 శాతం ఎగబాకింది.



ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో వేగం పెంచాలని

## కేంద్ర మంత్రిని కోరిన ఎమ్మెల్యే బండారి

ఉప్పల్, తెలంగాణ ముచ్చట్లు:

ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేస్తూ, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గట్కారీకి వినతి పత్రం అందజేశారు. అంబర్‌పేటలో ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర మంత్రిని కలిసి ఈ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఎలివేటెడ్ కారిడార్ పనుల్లో భారీగా జాప్యం చోటు చేసుకుందని, దీనికి కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ప్రజల సహనం ఇప్పుడు తారాస్థాయికి చేరిందని, వెంటనే పనులు పూర్తిచేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కేంద్ర మంత్రి నితిన్ గట్కరీ ఈ విషయంలో సానుకూలంగా స్పందించారని, పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

# ఎపిలోని గోదావరి ఒడ్డున 'క్లబ్ మహీంద్రా' రిసార్ట్

ఎపిలోని గోదావరి నది ఒడ్డున పచ్చని కొబ్బరితోటలు, సుందరమైన బ్యాక్ వాటర్‌లతో చుట్టుకున్న 'క్లబ్ మహీంద్రా' రిసార్ట్ ప్రారంభమయ్యింది. ఈ రిసార్ట్‌లో 100 గదులు ఉన్నాయి. మొదటి దశలో 50 గదులు ప్రారంభమవుతాయి. మిగిలిన 50 గదులు ఈ ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికం నాటికి ప్రారంభమవుతాయని సమాచారం. మహీంద్రా హాలిడేస్ అండ్ రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్ లో ప్రధాన బ్రాండ్ అయిన 'క్లబ్ మహీంద్రా' దాని పోర్ట్‌ఫోలియోలో మూడు కొత్త రిసార్ట్‌లను జోడిరచినట్లు ప్రకటించింది. బ్రాండ్ విస్తరణలో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లోకి కూడా ప్రవేశించింది. అంతే కాకుండా.. బ్రాండ్ వియత్నాంలోని సైగాన్ ప్రాంతం.. అబుదాబిలో కూడా తన ఉనికిని బలోపేతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరిలోని దిండి ఆర్వీఆర్.. అద్భుతమైన నదీతీర రిట్రీట్ గంభీరమైన గోదావరి నది వెంబడి ఉంది. పచ్చని కొబ్బరి తోటలు, సుందరమైన బ్యాక్ వాటర్‌లతో చుట్టుముట్టబడిన ఈ రిసార్ట్, కుటుంబం, స్నేహితులతో కాలం గడపడానికి అనువైన ప్రదేశంగా ఉంది.



## 3,300కుపైగా కంపెనీల పేర్లు తొలగింపు!

కంపెనీల చట్టం కింద నమోదైన కంపెనీల సంఖ్య తగ్గనుంది. ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు లేనందున తమ పేర్లు తొలగించాలని 3,300కు పైగా కంపెనీలు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రి త్వ శాఖకు దరఖాస్తు చేశాయి. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని వివిధ రాష్ట్రాల రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఓసీ) పత్రికల్లో నోటిఫికేషన్లు జారీ చేశాయి. కంపెనీల చట్టంలోని సెక్షన్ 248 (2) ప్రకారం ఏదైనా కంపెనీ నమోదైన ఏడాదిలోగా వ్యాపారం ప్రారంభించక పోయినా లేదా ఒక ఆర్థిక సంవత్సరం తర్వాత వరుసగా రెండేళ్ల పాటు ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు చేయకపోయినా ఆ కంపెనీ తమ పేరును రికార్డుల నుంచి తొలగించమని కోరవచ్చు. అయితే అందుకు వాటాదారుల్లో 75 శాతం మంది ఆమోదం కావాలి. మహారాష్ట్ర నుంచే ఎక్కువ: తమ పేర్లను రికార్డుల నుంచి తొలగించమని మహారాష్ట్ర నుంచే ఎక్కువ కంపెనీలు కోరాయి. ఆ రాష్ట్రం నుంచి దీనికి సంబంధించి 700కు పైగా కంపెనీల నుంచి విజ్ఞప్తులు అందాయి. ఢల్లీ (500ం) కర్ణాటక (350ం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గుజరాత్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ నుంచి కూడా రెండేసి వందల కంపెనీలు ఇందుకోసం విజ్ఞప్తి చేశాయి. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి దేశంలో 28,52,449 కంపెనీలు నమోదై ఉండగా అందులో 18,50,932 కంపెనీలు మాత్రమే చురుగ్గా పని చేస్తున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

- పెద్దమందడి మండలంలో పదవ తరగతి ఫలితాలే నిదర్శనం
- విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు ప్రారంభం
- పెద్దమందడి ఎంఈఓ బాణం విష్ణు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ఎంఈఓ బాణం విష్ణు తెలిపారు. పెద్దమందడి మండలంలో పదవ తరగతి ఫలితాలే దీనికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం మండలంలోని జడ్పీహెచ్ఎస్ బలిజపల్లి , జడ్.పి.హెచ్.ఎస్ పెద్దమందడి పాఠశాలలో హెచ్ఎం మంజులత, శాంతన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు ప్రారంభించారు.ఇట్టి కార్యక్రమంలో విద్యార్థులలో కనీస అభ్యసన స్థాయిలు, గణితము, తెలుగు, ఇంగ్లీషు మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ అలాగే విద్యార్థులలో ఆర్ట్ అండ్ కల్చరల్ మరియు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కు సంబంధించిన నైపుణ్యాలను పెంపొందించడంలో ఈ క్యాంపులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇట్టి క్యాంపులను సద్వినియోగం చేసుకొని మంచి ఆనందకరమైన వాతావరణంలో అన్ని రకాల స్కిల్స్ అభివృద్ధి చెందించుకోవాలని మండల విద్యాధికారి బాణం విష్ణు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ పిడి మరియు ,మన్యం పిడి తో పాటు వేణుగోపాల్ రెడ్డి ఎస్ ఏ, ఫిజికల్ సైన్స్ సుగుణ, జయంతి , సిఆర్పి తిరుపతి రెడ్డి పాల్గొనడం జరిగింది.

# మంత్రుల పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి...

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- గవర్నమెంట్ హాస్పిటల్, రఘునాథపాలెం వద్ద ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**






మంత్రుల పర్యటనలో భాగంగా నిర్వహించే ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవన నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్, రఘునాధపాలెం వద్ద నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవన నిర్మాణ ప్రదేశంను పరిశీలించారు. ప్రభుత్వ వైద్య కళాశాల శంకుస్థాపనకు రాష్ట్ర మంత్రులు విచ్చేయనున్నారని, అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు.

రాబోయే రోజుల్లో మెడికల్ విద్యార్థుల అవసరాల దృష్ట్యా నూతన వైద్య కళాశాల భవన నిర్మాణం కోసం రఘునాధపాలెం వద్ద భవన నిర్మాణ పనులకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, మంత్రులతో శంకుస్థాపనకు అన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మంత్రుల పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని, సభా స్థలి, సౌండ్ సిస్టం, ప్రజలకు సరిపడా కుర్చీలు, టెంట్, సభా వేదిక ప్రత్యేకంగా పరిశీలించి ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

మంత్రుల పర్యటన నేపథ్యంలో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. మంత్రులు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శిస్తారని తర్వాత ప్రభుత్వ మెడికల్ కాలేజ్ నూతన భవనాలకు శంకుస్థాపన పూర్తిచేసిన తర్వాత కలెక్టరేట్ లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆదేశించారు.

అనంతరం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని జిల్లా కలెక్టర్, ఆదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ ఆగస్త్య లతో కలిసి తనిఖీ చేశారు. ప్రధాన ఆస్పత్రిలోని క్యాజువాలిటి, వెయిటింగ్ హాల్, ల్యాబ్, డయాగ్నొస్టిక్ సెంటర్, దోబీ మిషనరీస్, ఎంపిహెచ్ డబ్ల్యు.ట్రైనింగ్ సెంటర్, మెడికల్ కళాశాల బాలుర వసతిగృహం, ఎంసిహెచ్, యునాని, ఆయుర్వేద వైద్యశాల, ఓపి, మార్చురీ పక్కనున్న ఖాళీ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు.

దవాఖానకు వచ్చే వాహనాల పార్కింగ్, హాస్పిటల్ ప్రధాన గేట్, బయట వాహనాల రద్దీ నియంత్రణ, ప్రధాన మార్గం విషయమై కలెక్టర్ చర్చించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని అన్నారు. మంత్రుల పర్యటన సందర్భంగా ఆసుపత్రికి కావాల్సిన వైద్య పరికరాలు, సౌకర్యాలు, నిర్వహణ గురించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఆసుపత్రిలో నిర్వహణ పక్కాగా ఉండాలని తెలిపారు. టూ వీలర్, కార్లు పార్కింగ్ నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్ కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఆస్పత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులు వైద్యం నిమిత్తం ఏ విభాగం ఎక్కడ ఉంటుందో తెలిసేలా సూచికలు ప్రదర్శించాలని అన్నారు. టాయిలెట్ మరమ్మత్తు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. ఎల్. కిరణ్ కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రాజేశ్వర రావు, సహాయ మున్సిపల్ కమీషనర్ షఫీయుల్లా, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్ కుమార్, వైద్యాధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



# సహజ సిద్ధమైన మామిడి పండ్లను విక్రయించాలి.....

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ లోని మామిడి పండ్ల స్టాల్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

రైతులు, వినియోగదారులు మామిడి పండ్ల మార్కెట్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం నగరం లోని పెవిలియన్ గ్రౌండ్ లో కార్బైడ్ రహిత మామిడి పండ్ల మేళా స్టాల్ ను జిల్లా సందర్శించారు. స్టాల్ లో ఉంచిన పలు రకాల మామిడి పండ్లను పరిశీలించారు. స్టాల్ నిర్వాకులు బాణోత్ లక్ష్మణ్ నాయక్ తో కలెక్టర్ ముచ్చటించారు. గత 13 సంవత్సరాలుగా మామిడి పండ్లను నేరుగా అమ్ముతున్నానని, ముందుగా ఒకడిగా మొదలు పెట్టి నేను 10 మందికి పని కల్పించి వ్యాపారం చేస్తున్నానని తెలిపారు. ప్రజల నమ్మకం తో కార్బైడ్ రహిత పండ్లను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ పలు రకాల మామి పండ్లలను అమ్మడం జరుగుతుందని అన్నారు. కలెక్టర్ చొరవతో ప్రత్యేకంగా రోటరీనగర్ లో మామిడి పండ్ల మార్కెట్ రావడం తో అక్కడ కూడా ఒక స్టాల్ ఏర్పాటు చేశామని రైతు లక్ష్మణ్ నాయక్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం నగరం రోటరీ నగర్ లోని వీధి వ్యాపారుల ప్రాంగణంలో 30 పైగా స్టాళ్లతో మామిడి పండ్ల మార్కెట్ ను నూతనంగా ఏర్పాటు చేశామని, స్టాల్ లలో రైతులు పండ్ల అమ్మకం చేపట్టారని, రైతులు ఎక్కువ సంఖ్యలో విచ్చేసి మొత్తం స్టాల్ లు నిండుగా పండ్ల వ్యాపారం జరిగేలా చూస్తున్నమని తెలిపారు. ఖమ్మం పరిసర మండలాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి మామిడి రైతులు ఇక్కడికి విచ్చేసి పండ్లు విక్రయించుకుంటారని కలెక్టర్ తెలిపారు. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడే విధంగా మార్కెట్ అందుబాటులోకి వచ్చిందని, దళారులు లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, వినియోగదారులకు సహజ సిద్ధంగా పండించిన కార్బైడ్ రహిత మామిడి పండ్లు అందేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.

మామిడి పండ్ల మార్కెట్ మాత్రమే కాకుండా మామిడి సీజన్ ముగిసిన తర్వాత వివిధ సీజన్లలో వచ్చే ప్రత్యేకమైన పండ్లు జామ, సీతాఫలం, బొప్పాయి వంటివి రైతులు నేరుగా వచ్చి ఇక్కడ విక్రయించేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్, హార్టికల్చర్ అధికారిణి అనిత శ్రీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ ఐకాన్ అవార్డు అందుకున్న బాలు కాంపల్లి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**




హైదరాబాద్ బిర్లా సైన్స్ భాస్కర్ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం జరిగిన సాయి అలేఖ్య సాంస్కృతిక సేవా సంస్థ అరుణ ఉపాద్రష్ట ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో "గద్దర్ ఐకాన్ అవార్డు" ను ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కవి, గాయకుడు బాలకృష్ణ అలియాస్ బాలు కాంపల్లి, స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా అవార్డు ను అందుకున్నారు. బాలు కాంపల్లి ఉద్యమ పాటలు, జానపద పాటలు రాస్తూ.. పాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చాడు. తెలంగాణనే కాకుండా ఆంధ్ర ప్రదేశ్. చతీస్ గడ్. కర్ణాటక, ఢిల్లీ, ముంబైయి రాష్టాలలో కూడా తన బృందంతో ప్రదర్శనలు నిర్వహించారు. గల్ఫ్ దేశాలకు వెళ్ళి మోసపోయి ఎన్నో ఇబ్బందులకు గురవుతున్న మహిళలపై పాటలు, బతుకమ్మ పాటలు, జానపద పాటలు, పొలిటికల్, అభ్యుదయ పాటలు రాస్తూ రచయితగా రానిస్తున్నాడు బాలు కాంపల్లి. హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్, తెలంగాణ సాంస్కృతి సారధి చైర్మన్ వెన్నెల గద్దర్, విమలక్క, వేగుగోపాలాచారి, సంస్థ చైర్మన్ అరుణ అశోక్ చేతుల మీదుగా గద్దర్ ఐకాన్ అవార్డు అందుకోవటం జరిగింది. బాలు కాంపల్లి గద్దర్ అవార్డ్ రావటం పట్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా కవులు, కళాకారులు, రెడ్డిగూడెం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


# శేష జీవితం ప్రజాసేవకు అంకితమవ్వాలి

**--వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పదవీ విరమణ పొందిన ప్రతి ఒక్కరి శేషజీవితం ఏదో రకంగా ప్రజాసేవకు అంకితం ఇవ్వాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు. వనపర్తి పట్టణంలోని ఎం వై ఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఎంపీపీఎస్ ఎన్టీఆర్ నగర్ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహించే గులాబ్ రాణి పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయురాలు గులాబ్ రాణి గారితో పాటు భర్త మాజీ ఎంపీటీసీ దామోదర్ దంపతులిద్దరికీ శాలువా, పూలమాలలతో సన్మానించారు.పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వ నుంచి అందించే బెనిఫిట్స్ అందించడంలో ఏదైనా జాప్యం జరుగుతే దానిని తన దృష్టికి తీసుకురావాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రస్తుతం పదవి విరమణ పొందిన గులాబ్ రాణి గారి దంపతులు ప్రజా సేవ చేయడానికి ముందుకు వస్తే తాను ఎల్లవేళలా సహకరిస్తానని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# ఖమ్మంలో డిజిటల్ అరెస్ట్ కలకలం..

**ఒక్క కాల్ తో రూ.26 లక్షలు ఎలా కొట్టేశారంటే?**

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

డబ్బులు కాజేసేందుకు సైబర్ నేరగాళ్లు ఎంచుకున్న కొత్తమార్గం డిజిటల్ అరెస్ట్. ఐపీఎస్, సీబీఐ, ఈడీ అధికారుల పేరిటి సైబర్ నేరగాళ్లు వీడియోకాల్ ద్వారా లైన్లోకి వచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారు.

డ్రగ్స్, మనీలాండరింగ్ ఇతర కారణాలతో అరెస్ట్ చేస్తున్నట్లు బెదిరిస్తారు. వీడియో కాల్ కట్ చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తారు. బెయిల్ మంజూరు చేయాలంటే తాము సూచించిన ఖాతాల్లోకి డబ్బులు బదిలీ చేయాలని ముగ్గులోకి దించుతారు. ఇలా మాటలతోనే డబ్బులు దోచేస్తారు. తాజాగా ఖమ్మం లో ఓ మహిళకు అదే పరిస్థితి ఎదురైంది. వీడియో కాల్ చేసి బెదిరించిన కేటుగాళ్లు రూ.26 లక్షల 50 వేలు కొట్టేశారు.

ఇటీవల బాధిత మహిళకు వీడియోకాల్ చేసిన కేటుగాడు తనను తాను ఐపీఎస్ దయానందగా పరిచయం చేసుకున్నాడు. బాధిత మహిళ అకౌంట్ నుంచి ఇల్లీగల్ లావాదేవీలు జరిగాయని బెదిరింపులకు దిగాడు.17 మంది యువతులు బాధిత మహిళపై ఫిర్యాదు చేశారని బెదిరింపులకు దిగిన కేటుగాడు, ఈ విషయంలో సదరు మహిళను అరెస్ట్ చేస్తామని బెంగళూరు, ముంబై పోలీసుల పేరుతో విచారణ చేస్తున్నామని వెల్లడించారు. దీంతో మహిళ ఆందోళను గురికావడంతో అదే ఆసరాగా తీసుకుని అరెస్ట్ చేయకుండా ఉండాలంటే రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో చేసేదిలేక సదరు మహిళ బ్యాంకులో ఉన్న నగదును కేటుగాళ్లు చూచించిన అకౌంట్కు పంపింది. అయినప్పటికీ మరింత డబ్బు కావాలని డిమాండ్ చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తన ఒంటిపై ఉన్న గోల్డ్ తాకట్టు పెట్టి కేటుగాళ్లకు పంపింది.

మహిళ అడిగిన కొద్ది డబ్బు పంపిస్తుండంతో మరోసారి కేటుగాళ్లు బెదిరింపులకు దిగారు. మరింత డబ్బును డిమాండ్ చేయడంతో ఆ మహిళ బంధువులను డబ్బు అవసరముందని అడిగింది బంధువులు ఆరా తీయడంతో తనకు వచ్చిన కాల్ తను డబ్బులు పంపించిన విషయాన్ని వెల్లడించింది. వారు అసలు విషయం చెప్పడంతో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గ్రహించిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అకుంఠిత దీక్షతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి...

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను అభినందించిన జిల్లా కలెక్టర్.

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించి, అకుంఠిత దీక్షతో, విద్యతో పాటు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఇటీవల పదో తరగతి పరీక్షా ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకింగ్ లు సాధించిన విద్యార్థినులతో జిల్లా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కాసేపు ముచ్చటించారు. భవిష్యత్ లో మీరు ఏమీ కావాలనుకుంటున్నారని జిల్లా కలెక్టర్ వారి మాటల్లోనే అడిగి తెలుసుకున్నారు.

అదేవిధంగా మీరు ఎంతగానో శ్రమ చేస్తే కానీ ఈ స్థాయికి రావడం జరిగిందని, ప్రస్తుతం విద్యలో వెనుకబడిన విద్యార్థులకు విద్యా మెళకువలను నేర్పుతూ ఐదుగురు విద్యార్థులను చైతన్యవంతులను చేసి మరల తన వద్దకు వచ్చి ఆ ఐదుగురిని స్టూడెంట్స్ ను తనకు చూపాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజను మీరు ఆదర్శంగా తీసుకొని విద్యా రంగంలో మరింత ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడేందుకు రాజ్యాంగ పరిరక్షణ వేదిక సంస్థలో తాము సభ్యత్వం పొందామని, తమను విష్ చేయండి... బ్లెస్ చేయండి... గైడ్ చేయండి... మీరే... మాకు.. రోల్ మోడల్... అంటూ... జిల్లా కలెక్టర్ తో విద్యార్థులు సంభాషించారు. ఏ రంగంలో నైనా కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే సాధ్యమవుతుందని, మీరు కన్న కలలను సాకారం చేసుకునేందుకు శ్రమించాలని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ముగ్గురు టాపర్స్ భువన శ్రీ, శిరీష, శ్రీజలను శాలువాతో సత్కరించి వారిని ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక బాధ్యులు డాక్టర్ నజీర్, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించిన గోనె శైలజ శ్రీకాంత్

**ఉప్పల్,తెలంగాణ ముచ్చట్లు:**



చిల్కానగర్ ప్రభుత్వ పాఠశాల పదోతరగతి పరీక్షల్లో 82 శాతం ఉత్తీర్ణత నమోదు చేసింది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు బిజెపి చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి గోనె శైలజ శ్రీకాంత్ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు.
విద్యార్థులను శాలువాలతో సత్కరించి, మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ఒక్కొక్కరికి రూ.10,000 నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ఉప్పల్ మండలంలో రెండో అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదు చేయడం గర్వకారణం. అలాగే, విద్యార్థినీ అక్షయ 540 మార్కులతో మండల స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. టీచర్లు స్వల్పంగా అందుబాటులో లేకపోయినా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఈ విజయానికి ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ముఖ్యమైనవి" అని పేర్కొన్నారు.
పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి మాట్లాడుతూ, "సైన్స్, ఇంగ్లీషు వంటి కీలక కాంశాల బోధనకు మొదటి ఆరు నెలలు ఉపాధ్యాయుల కొరత ఉండగా, గోనె శ్రీకాంత్ చొరవ తీసుకొని ఎంపి ఈటల రాజేందర్, జిల్లా కలెక్టర్, డీఈఓల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఫలితంగా ఇద్దరు టీచర్లను నియమించడంతో విద్యార్థులకు ఉపయోగపడింది" అన్నారు.
ఈ కార్యక్రమంలో గోనె అంజయ్య, కావాలి నర్సింహ్మా, పోలోజు శ్రీనివాస్ చారి, పెరుమాళ్ శివకుమార్, నక్కబొయిన కేశవులు, గుర్రాల భీమ్మయ్య తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తపరుస్తూ గోనె శ్రీకాంత్ కు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రతి రైతుకు ఐడీ కార్డు

- 11 అంకెలతో ప్రత్యేక నంబర్ కేటాయింపు
- రైతు రిజిస్ట్రేషన్ ను పరిశీలించిన జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి.పుల్లయ్య

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**



కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఫార్మర్ ఐడీ' ప్రాజెక్టు అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్యను కేటాయించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి. పుల్లయ్య తెలిపారు. సోమవారం ఖమ్మం జిల్లా, రఘునాథపాలెం మండలం, వి వెంకటాయపాలెం క్లస్టర్ లో రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు క్రింద ప్రతి రైతుకు 11 నంబర్ల యూనిక్ ఐడీ కేటాయించి, వారికి ఉన్న భూమి రకం, సాగు, వ్యక్తిగత వివరాలను డిజిటల్ రూపంలో ప్రభుత్వం నమోదు చేయనుందన్నారు. మే 5 నుంచి జూన్ 5 వరకు నెలరోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా వ్యవసాయ రంగంలో డిజిటల్ విప్లవం రానుందని ఆయన అన్నారు.
ఫార్మర్ ఐడీ అనేది రైతులకు అందించే డిజిటల్ గుర్తింపు కార్డు అని దీనిని ఆధార్ కార్డుతో లింక్ చేయనున్నట్లు తెలిపారు . ఈ 11 అంకెల ఐడీలో రైతు పేరు. ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, పట్టాదారు పాస్ బుక్ వివరాలు, భూమి రకం(ఎర్ర నేల, నల్ల నేల, తరి, మెట్ట), సర్వే నెంబర్లు, సాగు చేసిన పంటలు.. పూర్తి సమాచారం నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఐడీద్వారా రైతు సాగు వివరాల చిట్టా అంతా ఒకే క్లిక్ తో తెలుసుకోవచ్చు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి, సాయిల్ హెల్త్ కార్డు, ఫసల్ బీమా యోజన వంటి పథకాలకు ఇది తప్పనిసరి కానుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలకు ఈ ఫార్మర్ ఐడీ అవసరంలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. రైతులు విధిగా ఏఈఓ ల వద్దకు వచ్చి ఆధార్ తో పాటు లింక్ అయిన ఫోన్ నెంబర్ వివరాలతో వచ్చి నమోదు చేయించుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.
ఈ సందర్భంగా వెంకటాయపాలెం క్లస్టర్ లో జరుగుతున్న రైతు నమోదు కార్యక్రమును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ బాలబత్తుల శిరిణ్మయి, రైతులు పాల్గొన్నారు.

# కూచిపుడి నృత్యంలో ఆకట్టుకుంటున్న శ్యాన్విక



**మేడిపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

చిన్న వయసులోనే కూచిపుడి నృత్యంలో అత్యుత్తమ ప్రతిభ చూపుతూ అందరి ప్రశంసలు అందుకుంటున్న శ్యాన్విక మరోసారి తన నృత్యనైపుణ్యాన్ని చాటింది. పిర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లికి చెందిన ఈ చిన్నారి ఇటీవల యాదాద్రి భువనగిరి స్వర్ణగిరి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని, కూచిపుడి నృత్య ప్రదర్శనతో శ్రోతల మన్ననలు పొందింది. తక్కువ సమయంలోనే శ్యాన్విక ఈ సంప్రదాయ నృత్య కళపై అద్భుత పట్టు సాధించడాన్ని విశేషంగా అభినందించారు. ఆమె ప్రదర్శనకు ఆలయ నిర్వహకులు, భక్తులు ఉత్సాహంగా స్పందించారు. శ్యాన్వికకు భవిష్యత్తులో మరిన్ని విజయాలు లభించాలని పలువురు ఆకాంక్షించారు.




# మార్క్స్ సిద్ధాంతమే నేటి సమాజానికి శిరోధార్యం

- సీపీఐ ఆధ్వర్యంలో మార్క్స్ 207వ జయంతి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్.బోస్

**ఉప్పల్,తెలంగాణ ముచ్చట్లు:**

మార్క్స్ సిద్ధాంతమే నేటి సమాజానికి శిరోధార్యమని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్.బోస్ తెలిపారు.కార్ల్ మార్క్స్ 207వ జయంతిని పురస్కరించుకుని ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో సీపీఐ కాప్రా సమితి ఆధ్వర్యంలో మార్క్స్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్.బోస్ మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ 207 సంవత్సరాల క్రితం 1818మే 5న జన్మించి, 1883 మార్చి 14న తన 65వ ఏట మరణించారని ,ఆయన తన జీవిత కాలమంతా చాలా విస్తృతమైన పరిధిలో మార్క్సిస్టు సిద్ధాంతంను అనుసరించాడని వారు అన్నారు. మార్క్స్,అతని సహచరుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్ కలిసి చరిత్ర యొక్క భౌతిక వాద అవగాహనను రూపొందించాడని. అదే చారిత్రిక భౌతికవాదంగా పేరు గాంచిందని అని అన్నారు. మార్క్స్ రచనలలోకెల్లా ప్రత్యేకమైనదీ,అద్భుతమైన గొప్ప గ్రంథం 'పెట్టుబడి' అని వారు తెలిపారు. ఒకానొక దశలో ఉత్పత్తి విధానం, పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ విధంగా నడుస్తుందో తెలియజేస్తూ దాని లోతులన్నింటినీ బహిర్గతం చేశాడన్నారు.అదనపు విలువలను కొల్లగొట్టడానికి శ్రమను ఒక సరుకుగా ఎలా ఉపయోగిస్తారో తెలియజెప్పాడు మార్క్స్. పెట్టుబడిదారీ విధానం ఒక ప్రపంచవ్యాప్త దోపిడి వ్యవస్థగా రూపొందనుందని మార్క్స్ ముందుగానే అంచనా వేయగలిగిన అపర మేధావి అని వారు అన్నారు.మార్క్స్, ఎంగెల్స్ "శాస్త్రీయ సోషలిజాన్ని" ముందుకు తెచ్చారన్నారు. ఎంతో విశిష్టమైన 'కమ్యూనిస్టు ప్రణాళిక'ను వారిరువురూ 1848లో ప్రచురించారన్నారు. తను ప్రతిపాదించిన సిద్ధాంతం శాశ్వతమైనదని,సర్వశక్తి సంపన్నమైనదని మార్క్స్ ఏనాడూ భావించలేదు. సమాజాన్ని అర్థంచేసుకోవడానికీ, దానిని మార్చడానికి అవసరమైన ఒక విధానాన్ని ఆయన రూపొందించాడన్నారు.విజ్ఞాన రంగాలన్నింటా మార్క్సిజాన్ని అభివృద్ధిపరచి తాజా పరిచే బాధ్యత మార్క్సిస్టులందరిదీ అని వారు తెలిపారు. ఇటువంటి కృషి ద్వారా మాత్రమే మనం సామాజిక మార్పు సాధించాలనే మన లక్ష్యాన్ని చేరుకోగలమని వారు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ జయంతి కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ.దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. శంకర్ రావు,సీపీఐ కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా,రాఘవేంద్రరావు,సత్య ప్రసాద్,సాయిలు, అశోక్, కిరణ్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# లస్కర్‌పై పత్రిక విలేకరి దాడి


**బాధితుడు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం**

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

హసన్ పర్తి మండలంలోని ఓ గ్రామంలో పనిచేస్తున్న ఇరిగేషన్ శాఖ లస్కర్‌పై అదే గ్రామానికి చెందిన ఓ పత్రిక విలేకరి దాడి చేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.
ప్రాథమిక సమాచారం ప్రకారం, గ్రామంలోని వాగు నుంచి గుర్తు తెలియని వ్యక్తులు మట్టిని తరలిస్తున్నట్లు పిడిఎఫ్ పత్రికలో పని చేసే విలేకరి అధికారులకు సమాచారం ఇచ్చాడు. పై అధికారుల ఆదేశాల మేరకు లస్కర్ ఆ ప్రాంతాన్ని పరిశీలించగా, మట్టితో ఉన్న వాహనాలు అప్పటికే అక్కడ లేకపోవడంతో ఘటనను అధికారులకు నివేదించి ఇంటికి తిరిగి వస్తున్న సందర్భంలో విలేకరి అతనిపై దాడికి పాల్పడ్డాడు.
ఈ సంఘటనపై బాధిత లస్కర్ స్థానిక పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడిని ఇరిగేషన్ శాఖ అధికారులు ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



# మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్



- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు
- సిపిఐ కార్యాలయంలో ఘనంగా కారల్ మార్క్స్ జయంతి వేడుకలు

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

ప్రపంచ గతిని మార్చిన మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు అన్నారు. కారల్ మార్క్స్ 207వ జయంతి సందర్భంగా హనుమకొండ బాల సముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో కారల్ మార్క్స్ చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మార్క్సిస్టు సిద్ధాంత కర్త, మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ అని అన్నారు. ప్రపంచంలో పెట్టుబడిదారీ సమాజానికి మార్క్సిజం ఒక్కటే ప్రత్యామ్నాయం అని అన్నారు.సమానత్వానికి, సామాజిక న్యాయానికి, నిరుద్యోగ నిర్మూలనకు మార్క్సిజం ఒక్కటే ఔషధం అని అన్నారు.ఎర్రజెండా నీడన పేద మధ్యతరగతి వర్గాలకు అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి,జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్ ఎ స్టాలిన్,నాయకులు మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, ఏషబోయిన శ్రీనివాస్, కొట్టేపాక రవి, మాలోతు శంకర్,ఏదునూరి వెంకటరాజం,కండె నర్సయ్య, దామెర సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభించిన జర్నలిస్ట్ ప్రవీణ్ పాటిల్

**జహీరాబాద్. తెలంగాణ ముచ్చట్లు:**

జహీరాబాద్ లోని దత్తు రెడ్డి యువ సైన్యం ఆధ్వర్యంలో చలివేంద్ర కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు.ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు దాహాన్ని తీర్చే ఉద్దేశంతో నిర్వహించిన చలివేంద్ర కేంద్రంతో రోడ్డుపై ప్రయాణించే బాటచారులకు,దాహాన్ని తీర్చేందుకు దత్తు రెడ్డి యువసేన చేసిన పనికి జర్నలిస్ట్ ప్రవీణ్ పాటిల్ అభినందించారు.దత్తు రెడ్డి యువసేన దత్తు రెడ్డి 5వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా ఇంత గొప్ప కార్యాన్ని చేపట్టడం హర్షనీయమన్నారు.ఈ సందర్భంగా దత్తు రెడ్డి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఇంత గొప్ప కార్యాన్ని తన చేత చేయించిన దత్తు రెడ్డి యువసేన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్మెడ అనిల్ కుమార్,నగేష్,మహేష్ రవి,బాలరాజు,యువజన నాయకులు పాల్గొన్నారు.








# అనుమతి లేకుండా బోర్ వేస్తే కఠిన చర్యలు తప్పవు

- ఉప్పల్ ఎమ్మార్వో టీ.వాణి రెడ్డి
- 2 బోర్ వెల్స్ సీజ్ చేసిన రెవిన్యూ అధికారులు
- జరిమానా వేసిన రెవెన్యూ సిబ్బంది

**ఉప్పల్,తెలంగాణ ముచ్చట్లు:**

మండల పరిధిలోని ఎమ్మార్వో అనుమతి లేకుండా బోర్ వెయ్యొద్దు,అనుమతి లేకుండా వేసిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉప్పల్ ఎమ్మార్వో టి, వాణిరెడ్డి మండల ప్రజలకు తెలిపారు.సోమవారం మేడ్చల్ మల్కాజిరి జిల్లా ఉప్పల్ మండల పరిధిలోని బీరప్ప గడ్డ,కొత్తపేటలోని న్యూ మారుతి నగర్ లోని అనుమతి లేకుండా బోరు వేస్తున్న 2 బోర్ వెల్స్ ను ఉప్పల్ ఎమ్మార్వో టి,వాణిరెడ్డి,డిప్యూటీ తాసిల్దార్ సునీల్ కుమార్ ఆదేశాల మేరకు ఉప్పల్ ఆర్,ఐలు ఎం,అశ్విని గౌడ్,పి,సామ్సన్ పాల్, జూనియర్ అసిస్టెంట్లు ఎం, అలివేలు,పి,వెంకన్న,లక్ష్మిలు సీజ్ చేశారు,అనంతరం జరిమానా వేశారు, ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... అనుమతి తీసుకొని బోర్ వేసుకోవాలని వారు సూచించారు,అనుమతి లేకుండా బోర్ వేస్తే కఠిన చర్యలు తప్పవు అని వారు హెచ్చరించారు,

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రాత్రిపూట ఈ పండ్లు అస్సలు తినకండి...?



రాత్రిపూట తీసుకునే ఆహారం మన నిద్రపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా కొన్ని పండ్లు రాత్రి తినడం వల్ల అజీర్ణం, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ కారణంగా కొన్ని పండ్లను రాత్రి సమయంలో తీసుకోక పోవడం ఉత్తమం. పండ్లు ఆరోగ్యానికి మేలైనవి. అయితే రాత్రిపూట కొన్ని పండ్లు తినడం వల్ల జీర్ణవ్యవస్థపై ప్రభావం పడుతుంది. దీనివల్ల నిద్రలో అంతరాయం కలుగుతుంది.

కనుక రాత్రిపూట కొన్ని పండ్లు తినకుండా ఉండటం ఉత్తమం. అరటిపండు చక్కెర, ఫైబర్ ఎక్కువగా కలిగి ఉంటుంది. కానీ రాత్రిపూట తింటే జీర్ణక్రియలో గందర గోళం ఏర్పడుతుంది. శ్లేష్మం పెరగడం వల్ల గొంతు వాపు వచ్చే అవకాశం ఉంది. దీని వల్ల నిద్ర కుదరదు. అందువల్ల రాత్రి సమయంలో అరటిపండు తినకపోవడం మంచిది. ఆపిల్ రోజులో తినడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

కానీ రాత్రిపూట తింటే గ్యాస్, అజీర్ణం, గుండెల్లో మంట కలుగుతుంది. షుగర్ స్థాయిలు పెరిగి నిద్రపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారికి ఇది అధికంగా బాధిస్తుంది. సపోటా తీపి రుచితో ఉండి శక్తి కలిగించే పండు. కానీ రాత్రిపూట తింటే షుగర్ స్థాయి పెరుగుతుంది. శక్తి ఎక్కువగా ఉండడం వల్ల నిద్ర రాదు. అజీర్ణం ఏర్పడుతుంది. కనుక సపోటా పగలు తినడం ఉత్తమం. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. రాత్రిపూట తింటే తరచూ మలవిసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. దీని వల్ల నిద్రలో అంతరాయం కలుగుతుంది. ఇందులో చక్కెర ఎక్కువగా ఉండటం వల్ల శక్తి ఎక్కువై నిద్ర రాదు. జామకాయలో ఫైబర్ అధికంగా ఉంటుంది. రాత్రిపూట తింటే జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. ఫలితంగా ఉబ్బరం, అసౌకర్యం కలుగుతుంది. ఇందులో ఉన్న చక్కెర రక్తంలో షుగర్ పెంచుతుంది. కనుక గట్టి జామకాయ రాత్రిపూట తినకపోవడం మంచిది. పైనాపిల్ ఆరోగ్యానికి మంచిది అయినా.. రాత్రిపూట తింటే జీర్ణక్రియకు ఇబ్బంది కలుగుతుంది. ఇందులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది యాసిడ్ రిఫ్లక్స్, గుండెల్లో మంట లాంటి సమస్యలు కలిగిస్తుంది. రాత్రిపూట తిన్నా ఇబ్బంది లేని పండ్లు కూడా ఉన్నాయి. చెర్రీస్, బెర్రీస్ వంటి పండ్లు సులభంగా జీర్ణమవుతాయి. ఇవి నిద్రను మెరుగుపరచగల లక్షణాలు కలిగి ఉంటాయి. కనుక రాత్రి సమయంలో ఇవి తినడం మంచిది.

# వంటల్లో వాడే ఆయిల్స్ అన్నీ మంచివికావట..?



మన రోజు వంటల్లో నూనె తప్పనిసరి. కానీ కొన్ని నూనెలు ఆరోగ్యానికి మేలు చేయకుండా హానికరమవుతాయి. ఇవి శరీరంలో మంటలు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి సమస్యలకు కారణమవుతాయి.మనకు రోజువారీ వంటలలో నూనె చాలా అవసరం. అందుకోసం పొద్దుతిరుగుడు, సోయాబీన్, కనోలా వంటి వివిధ రకాల నూనెలు వాడుతున్నారు. కానీ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ నూనెలు అన్ని ఆరోగ్యానికి మంచివి కావు. వాస్తవానికి కొన్నింటిని వంటకాలలో వాడటం ప్రమాదకరంగా కూడా మారొచ్చు.శుద్ధి చేసిన పొద్దుతిరుగుడు నూనె.. ఈ నూనెలో ఒలీక్ ఆమ్లం ఎక్కువగా ఉంటే మంచిదే.. కానీ శుద్ధి చేసిన నూనెలో ఒమేగా 6 ఎక్కువగా ఉంటుంది. అధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేస్తే ఇది విషంగా మారుతుంది. అధిక వేడి వల్ల దీనిలో ఫ్రీ రాడికల్స్, ఆల్డిహైడ్లు వంటి హానికరమైన పదార్థాలు తయారవుతాయి. ఇవి గుండె సమస్యలు, క్యాన్సర్‌కి దారితీస్తాయి. సోయాబీన్ నూనె.. ఇది హెక్సేన్ అనే రసాయనాన్ని ఉపయోగించి తయారు చేస్తారు. ఈ విధానం పోషకాలను పూర్తిగా తగ్గిస్తుంది. దానికితోడు ఇందులో ఒమేగా 6 ఎక్కువగా ఉండటంతో శరీరంలో మంటకు దారి తీస్తుంది. ఎక్కువ వేడి చేస్తే హానికరమైన పదార్థాలు తయారవుతాయి. కనోలా నూనె.. రాప్సీడ్ విత్తనాల నుంచి తీసే ఈ నూనె జన్యుపరంగా మార్చబడిరది. అధిక ఉష్ణోగ్రత వద్ద ప్రాసెస్ చేస్తారు. దీనివల్ల ట్రాన్స్ ఫ్యాట్స్ ఏర్పడి అవి శరీరానికి మేలు చేయవు. ఇందులో ఉండే ఒమేగా 6 అధికంగా ఉండడం వల్ల వాపులు, ఇతర సమస్యలు తలెత్తుతాయి. పత్తి గింజల నూనె.. పత్తి విత్తనాల నుంచి వచ్చే ఈ నూనెను ఎక్కువగా ప్రాసెస్ చేస్తారు. ఇందులో గోసిపోల్ అనే సహజ విషం ఉంటుంది. ఇది కాలేయానికి, పునరుత్పత్తి వ్యవస్థకు హానికరం. ఈ నూనెను వంటలో వాడటం మంచిది కాదు. మొక్కజొన్న నూనె.. ఇది కూడా హెక్సేన్ వంటి రసాయనాలతో తయారవుతుంది. ఇందులో ఒమేగా 6 అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో మంట పెంచుతుంది. దీని వల్ల గుండె జబ్బులు, ఊబకాయం, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధుల అవకాశాలు పెరుగుతాయి. తయారీ సమయంలో పోషకాలు తగ్గిపోయి హానికర పదార్థాలు పెరిగే అవకాశం ఉంటుంది. కూరగాయల నూనె.. ఇది వివిధ విత్తనాలు, గింజల నుంచి తయారవుతుంది. దీంట్లో చౌకైన పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. ఈ నూనె అధికంగా ప్రాసెస్ చేయబడుతుంది. వాడేటప్పుడు ట్రాన్స్ ఫ్యాట్స్, ఫ్రీ రాడికల్స్, ఇతర టాక్సిన్లు ఏర్పడతాయి. ఇవి శరీరానికి మేలు చేయవు. కుసుమ నూనె.. ఈ నూనెలో పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు ఎక్కువ. ఇవి వేడి సమయంలో విచ్ఛిన్నమై హానికరమైన పదార్థాలుగా మారతాయి. ఇందులో లినోలెయిక్ ఆమ్లం ఎక్కువగా ఉంటుంది. ఇది గుండె సమస్యలు, క్యాన్సర్, మధుమేహం వంటి సమస్యలకు దారి తీస్తుంది.



# ఈ చెట్టు ఉపయోగాలు తెలిస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే..!

కానుగ చెట్టు.. ఇది ఎక్కువగా రోడ్ల పక్కన ఎక్కువగా కనిపిస్తుంటాయి. 50 నుంచి 80 అడుగుల ఎత్తు వరకూ భారీగా పెరిగే ఈ వృక్షం పచ్చటి ఆకులతో నిండుగా కనిపిస్తుంది. ఇది చిన్న మొక్క నాటినా కూడా చాలా త్వరగానే పెరిగే మహా వృక్షంగా ఎదుగుతుంది. కానుగ చెట్టు ఆకులు కొంచెం గుండ్రంగా, పువ్వులు గుత్తులుగా నీలం, తెలుపు రంగుల్లో ఆకర్షణీయంగా ఉంటాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఈ చెట్టు నిండా పూలతో విరబూసి కనిపిస్తాయి. కానుగ కాయల్లో గింజలుంటాయి. వీటి నుంచి కానుగ నూనెను తీస్తారు. ఇంతకీ అసలు విషయం ఏంటంటే..కానుగ చెట్లకు కూడా ఆయుర్వేదంలో ఎంతో ప్రముఖ్యత ఉంది. కానుగ గింజల పొడిలో ఇంగువ కలిపి తీసుకుంటే కడుపులో నులిపురుగులు నశిస్తాయని అంటున్నారు. కానుగ పువ్వుల పేస్ట్‌ను తలపై రాసుకుంటే బట్టతల రాదు. వీటి ఆకులలోని కరెంజిన్, పొంగాపిన్, ఫ్యూరనో ఫ్లేవనాయిడ్స్ అనే శక్తివంతమైన పదార్థాలు మెదడు, రొమ్ము, ప్రోస్టేట్ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించడంలో సహాయపడతాయని నిపుణులు అంటున్నారు. కానుగ చెట్టు పువ్వును రక్తస్రావం హెమోరాయిడ్స్, పైల్స్ చికిత్సకు ఉపయోగిస్తారు. పొత్తికడుపులో కణితులు, స్త్రీ జననేంద్రియ అంటువ్యాధులు, అల్సర్లకు కానుగ చెట్టు కాయలతో చికిత్స చేస్తారని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. కణజాల కణితులు, అధిక రక్తపోటు, రక్తహీనత చికిత్సలకు కానుగచెట్టు విత్తనం సారాన్ని ఉపయోగిస్తారు. కానుగ గింజలతో తీసే గనూనెతో దీపాల్ని వెలిగిస్తారు. కీళ్లవాపులకు వాడే మందుల్లో వినియోగిస్తారు. కేంద్ర నాడీ వ్యవస్థను మృదువుగా చేయడానికి కానుగ చెట్టు కాండాన్ని ఉపయోగిస్తారు. కానుగ గింజలను మెత్తగా నూరి తేనెతోనూ, నెయ్యితోనూ, పంచదారతోనూ కలిపి తీసుకుంటే శరీరాంతర్గత రక్తస్రావం ఆగిపోతుంది. బ్రోంకటైస్, కోరింత దగ్గు, జ్వరం చికిత్సలో కానుగ చెట్టు ఆకుల పొడి సహాయపడుతుంది. రక్తస్రావ నివారిణిగా, పరాన్నజీవి పురుగులను చంపడానికి కానుగ నూనెను ఉపయోగిస్తారు. కోరింత దగ్గు, పైల్స్, కాలేయ నొప్పి, దీర్ఘకాలిక జ్వరం, అల్సర్లు చికిత్స చేయడంలో ఈ నూనె సహాయపడుతుంది. కానుగ కాయలు సబ్బుల తయారీలోనూ ఉపయోగిస్తారు.

# ప్యాకెట్ పాలను రోజులో మళ్లీ మళ్లీ వేడి చేస్తున్నారా ?

పాల ప్యాకెట్లపై సాధారణంగా ' పాశ్చరైజ్డ్ ', 'టోన్డ్' లేదా ఖను అని లేబుల్ వేస్తుంటారు. ఇందులో పాశ్చరైజ్డ్ పాలను తాగే ముందు మరిగించడం అవసరమా? పాల ప్యాకెట్ల నుంచి తీసిన పాలు మరిగించకుండా నేరుగా తాగితే ఏమవుతుంది? పాలు ఆరోగ్యానికి ఎంత మంచివో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నేటి కాలంలో డెయిరీలో, దుకాణంలో అందరూ పాల ప్యాకెట్లు తెచ్చుకుని వాడుతుంటారు. అయితే ఈ పాలను మరిగించకుండా తాగడం సరైందేనా అనే ప్రశ్న చాలా మందికి ఉంటుంది. పాల ప్యాకెట్ల నుంచి తీసిన పాలు మరిగించకుండా నేరుగా తాగితే ఏమవుతుంది? ఈ అనుమానం కూడా మీకు చాలా సార్లు వచ్చే ఉంటుంది. పాల ప్యాకెట్లపై సాధారణంగా ' పాశ్చరైజ్డ్ ', 'టోన్డ్' లేదా ఖను అని లేబుల్ వేస్తుంటారు. ఇందులో పాశ్చరైజ్డ్ పాలను తాగే ముందు మరిగించడం అవసరమా? దీని వల్ల కలిగే నష్టాలు ఏమిటో? పాల ప్యాకెట్‌ను ఒకసారి మరిగించిన తర్వాత రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే, దాన్ని మళ్ళీ మరిగించాల్సిన అవసరం లేదని డైటీషియన్, డయాబెటిస్ విద్యావేత్త కనికా మల్హోత్రా అంటున్నారు. పాశ్చరైజ్డ్ పాలు ఒకసారి వేడి చేశాక మళ్లీ వేడి చేయాల్సిన అవసరం లేదు. అందుకే వాటిని మళ్లీమళ్లీ ఉడకబెట్టాల్సిన అవసరం లేదు. ఒకవేళ పలుమార్లు వేడిచేస్తే లేనిపోని ఆరోగ్య సమమ్యలు వస్తాయి. కాబట్టి ప్యాక్ చేసిన పాశ్చరైజ్డ్ పాలు కలుషితమైతే లేదా సరిగా నిల్వ చేయకపోతే మాత్రమే మరిగించాలి. లేదంటే ఒకసారి మరిగిస్తే సరిపోతుంది. ముఖ్యంగా మీ ఇంట్లో ఆవు ఉంటే దాని పాలను ఎక్కువసార్లు మరిగిస్తే అందులోని పోషకాలు మార్పుకు లోనవుతాయి. ఇలాంటి పాలను నేరుగా కూడా తాగవచ్చు. పాలను మరిగించడం వల్ల వేడికి సున్నితంగా ఉండే బి విటమిన్లు, బి1, బి2 (రైబోఫ్లేవిన్), బి3, బి6, ఫోలిక్ యాసిడ్‌లు నశిస్తాయి. పోషకాల్లో దాదాపు 36% కోల్పోవల్సి వస్తుంది. పాలలో సాధారణంగా కనిపించే రిబోఫ్లేవిన్ మరిగించిన తర్వాత తగ్గుతుంది. మరిగించడం వల్ల పాలలోని కొన్ని ప్రోటీన్లు మారి, దాని కొవ్వు పదార్థాన్ని ప్రభావితం చేస్తాయి. కానీ దానిలోని మొత్తం కొవ్వు, మొత్తం కాల్షియం గణనీయంగా మారవు. పాలను మరిగించడం వల్ల పాలలోని బ్యాక్టీరియా నశిస్తుంది. కానీ పాశ్చరైజ్డ్ పాలను మళ్లీ మళ్లీ మరిగించాల్సిన అవసరం లేదు. రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసిన పాలను త్వరగా వాడుకోవాలి. పాశ్చరైజ్డ్ పాల ప్యాకెట్లలో బ్యాక్టీరియాను చంపడానికి వేడిచికిత్స చేస్తారు (సాధారణంగా 72లీజ వద్ద 15 సెకన్ల పాటు మరిగిస్తారు). ప్యాకెట్‌ను అలాగే ఉపయోగించి రిఫ్రిజిరేటర్‌లో ఉంచినట్లయితే మళ్లీ మరిగించడం అవసరం లేదు. ఐతే పాలు తాగే ముందు ఎప్పుడూ మరిగించాలనే విషయం మరచిపోకూడదు.



# మందులకన్నా పవర్‌ఫుల్ బ్రహ్మాస్త్రం..

వెల్లుల్లిలో అనేక ఔషధ గుణాలు దాగున్నాయి.. అందుకే.. దీన్ని పవర్‌ఫుల్ మసాలా దినుసుగా పేర్కొంటారు.. వెల్లుల్లి రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. ఇది గ్లూకోజ్ స్థాయిలను అదుపులో ఉంచడానికి కూడా సహాయపడుతుంది. వెల్లుల్లిలో అనేక ఔషధ గుణాలు దాగున్నాయి.. అందుకే.. దీన్ని పవర్‌ఫుల్ మసాలా దినుసుగా పేర్కొంటారు.. వెల్లుల్లి రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. ఇది గ్లూకోజ్ స్థాయిలను అదుపులో ఉంచడానికి కూడా సహాయపడుతుంది. వెల్లుల్లిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏంటి.. ఆయుర్వేద నిపుణులు ఏం చెబుతున్నారు.. ఈ వివరాలను తెలుసుకోండి.. ఎన్నో పోషకాలు దాగున్న వెల్లుల్లిని రోజూ తినడం వల్ల మన రోగ నిరోధక శక్తి బలపడుతుంది. ఇది కాలానుగుణ వ్యాధుల నుండి మనల్ని రక్షిస్తుంది. ఎందుకంటే వెల్లుల్లిలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ ఆరోగ్యానికి మంచిది. వెల్లుల్లిని మన ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి.. ఇది జలుబు, దగ్గు నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. ఇది వైరల్, ఫంగల్ ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.. అనేక ఆరోగ్య సమస్యల నుంచి మనల్ని రక్షిస్తుంది. వెల్లుల్లి మన గుండె ఆరోగ్యానికి కూడా మంచిది. ఎందుకంటే ఇది రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది.. మంచి కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు వెల్లుల్లిని తీసుకోవాలి.. ఎందుకంటే ఇది చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. ఇది రక్తం గడ్డకట్టడాన్ని నివారించడానికి కూడా సహాయపడుతుంది. వెల్లుల్లి తినడం వల్ల కలిగే శోథ నిరోధక లక్షణాలు ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షిస్తాయి. ఆర్థరైటిస్, డయాబెటిస్, కీళ్ల నొప్పులు ఉన్నవారు ముఖ్యంగా వెల్లుల్లిని తమ ఆహారంలో చేర్చుకోవాలి. ఇందులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కణ నష్టం నుండి రక్షిస్తుంది. ఆక్సీకరణ నష్టాన్ని కూడా నివారిస్తుంది. ఇది క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులతో కూడా పోరాడుతుంది. వెల్లుల్లి జీర్ణ ఆరోగ్యానికి మంచిది. ఇది జీర్ణ ఎంజైమ్‌లను కలిగి ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన ప్రేగు కదలికలకు మద్దతు ఇస్తుంది. ఇది కడుపులో గ్యాస్, అజీర్ణాన్ని తగ్గిస్తుంది. ఇది మంచి డీటాక్స్ లాగా పనిచేస్తుంది.

# సన్నగా నాజూగ్గా కావాలనుకుంటే..!

ఈ రోజుల్లో అధిక బరువుతో బాధపడే వారు చియా విత్తనాలను బరువు తగ్గించడానికి ఉపయోగిస్తున్నారు. ఈ చిన్న విత్తనాలు అధిక ఫైబర్‌తో శరీరంలో జీర్ణక్రియను మెరుగుపరచి, ఆకలి నియంత్రణలో సహాయపడతాయి. వీటి ఉపయోగం వల్ల శరీరానికి తేమను అందించి డీహైడ్రేషన్ నివారించడం కూడా జరుగుతుంది. ఈ చియా విత్తనాలను సరైన విధంగా తీసుకోవడం చాలా ముఖ్యం. ఈ రోజుల్లో చాలా మంది అధిక బరువుతో బాధపడుతున్నారు. డైట్ చేయడం, వ్యాయామం చేయడం వంటి మార్గాలతో పాటు కొన్ని సహజమైన ఆహార పదార్థాలు బరువు తగ్గేందుకు చాలా ఉపయోగపడతాయి. వాటిలో చియా విత్తనాలు ప్రముఖమైనవి. చిన్న పరిమాణంలో ఉన్నప్పటికీ ఈ విత్తనాల్లో పోషకాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారికి ఇవి చాలా ఉపయోగకరంగా మారతాయి.చియా విత్తనాల్లో పుష్కలంగా ఉండే ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. ఇవి జీర్ణక్రియను నెమ్మదింపజేస్తాయి.. ఫలితంగా ఎక్కువసేపు ఆకలి వేయదు. దీంతో తరచుగా తినాలనే కోరిక తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది చాలా ఉపయోగపడుతుంది. చియా విత్తనాలను నేరుగా తినడం వల్ల ఫైబర్ బాగా లభిస్తుంది. అయితే వీటిని నీటిలో నానబెట్టకుండా తినడం సురక్షితమైనది కాదు. ఎందుకంటే ఇవి తేమను శోషించుకునే స్వభావం కలిగినవిగా ఉండటంతో పొట్టలోకి వెళ్లిన తర్వాత శరీరంలోని నీటిని తీసుకుని డీహైడ్రేషన్‌కి దారితీయవచ్చు. దీని వల్ల జీర్ణ సమస్యలు, పొట్ట బరువు తలెత్తే అవకాశం ఉంది. కనుక విత్తనాలను నీటిలో నానబెట్టి తినడం మంచిది. వేసవి కాలంలో చియా విత్తనాలను నీటిలో నానబెట్టి తాగడం శరీరానికి తేమను అందించే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ఇది డీహైడ్రేషన్ నివారించడంలో సహాయపడుతుంది. ఉదయం పూట నానబెట్టిన చియా విత్తనాలతో తయారు చేసిన పానీయాన్ని తీసుకుంటే శక్తివంతంగా, తేలికగా అనిపిస్తుంది. ఇది జీర్ణతను మెరుగుపరచడమే కాకుండా ఎక్కువ సేపు ఆకలిని నిరోధించగలదు.చియా విత్తనాలను ఖాళీ పొట్టపై ఉదయం తీసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి. లేకపోతే భోజనానికి అరగంట ముందు తీసుకోవచ్చు. ఈ సమయంలో తీసుకోవడం వల్ల పొట్ట నిండిన భావన కలుగుతుంది. ఫలితంగా మీరు తినే ఆహార పరిమాణం తగ్గుతుంది. ఇది ఆహార నియంత్రణకు తోడ్పడుతుంది. చియా విత్తనాలను వాడే పద్ధతులు చాలా ఉన్నాయి. ఉదాహరణకి ఒక టీస్పూన్ చియా విత్తనాలను ఒక గ్లాసు నీటిలో వేసి కనీసం 30 నిమిషాలు నానబెట్టాలి. తరువాత ఆ నీటిని నేరుగా తాగవచ్చు. లేదా వీటిని పండు జ్యూస్, స్మూథీలు, పుడింగ్స్ వంటి డెజర్ట్‌లలో కలిపి తినవచ్చు. ఇవి తక్కువ కాలోరీలతో ఎక్కువ పోషకాలు అందించే ఆహారంగా నిలుస్తాయి. చియా విత్తనాలను రోజుకు 1 లేదా 2 టీస్పూన్లకంటే ఎక్కువ తినకపోవడం మంచిది.





దుల్కర్ సల్మాన్ హీరోగా, నహాస్ హిదాయత్ దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మకమైన సినిమా 'ఐ యామ్ గేమ్' తిరువనంతపురంలో గ్రాండ్ పూజతో షూటింగ్ ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మానే తన స్వంత బ్యానర్ వేఫారర్ ఫిలమ్స్‌పై నిర్మిస్తున్నారు. పూజ కార్యక్రమానికి ప్రధాన తారాగణం హాజరయ్యారు. అందులో ప్రముఖ నటులు యాంటోని వర్గీస్, తమిళ దర్శకనటుడు మిస్కిన్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కథను సజీర్ బాబు, ఇస్మాయిల్ అబుబక్కర్, బిలాల్ మొయిదు అందించారు. డైలాగ్ రైటర్స్ గా ఆధర్ష్ సుకుమారన్, షహబాస్ రషీద్ పని చేస్తున్నారు. ఇది దుల్కర్ సల్మాన్‌కు 40వ చిత్రం కావడం విశేషం, అలాగే నహాస్ హిదాయత్ బ్లాక్‌బస్టర్ 'ఆర్‌డిఎక్స్' తర్వాత దర్శకత్వం వహిస్తున్న ప్రాజెక్ట్ కావడం మరో హైలెట్. తిరువనంతపురంలో చిత్రీకరణ మొదటి షెడ్యూల్ కొనసాగుతోంది. ఇది దుల్కర్ ఇప్పటి వరకు చేసిన మలయాళ చిత్రాలలో అత్యంత భారీ బడ్జెట్ చిత్రంగా రూపొందుతోంది. ఇందులో హైవోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు ఉండబోతున్నాయి.

# దుల్కర్ సల్మాన్ 40వ సినిమా ప్రారంభం

# 'సింగిల్' ఫన్ రైడ్‌లా ఉంటుంది

కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్ బ్యానర్‌లో హోల్సమ్ ఎంటర్‌టైనర్ 'సింగిల్'తో అలరించబోతున్నారు. ఈ చిత్రంలో కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా నటించారు, వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిలమ్స్‌తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. సింగిల్ మే 9న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ ఇవానా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ''ఈ సినిమా కథ చాలా నచ్చింది. ఇందులో శ్రీ విష్ణు. వెన్నెల కిషోర్, కేతిక ఇలా చాలా అద్భుతమైనటువంటి నటులు ఉన్నారు. గీత ఆర్ట్ లాంటి గొప్ప సంస్థ ఉంది. నేను తెలుగులోకి రావడానికి ఇదే సరైన సినిమా అనిపించింది.ఇందులో హరిణి అనే పాత్రలో కనిపిస్తాను. తను డాన్సర్. తన క్యారెక్టర్ లో చాలా ఎమోషన్ ఉంటుంది. కుటుంబ బంధాలు ఉంటాయి. తాను ఎవరినైనా ఇష్టపడితే వాళ్లకోసం ఏదైనా చేయడానికి సిద్ధపడుతుంది. ఈ పాత్రలో చాలా ఎంజాయ్ చేశాను. ఈ సినిమా కోసం తెలుగు నేర్చుకోవడానికి చాలా ప్రయత్నించాను. శ్రీ విష్ణు తెలుగుని చాలా స్పీడ్ గా మాట్లాడుతారు. ఆయన మాట్లాడుతున్నప్పుడు నాకు మొదట్లో అర్థమయ్యేది కాదు. తర్వాత మెల్లమెల్లగా అలవాటు పడ్డాను. ఇది చాలా ఫన్ మూవీ. ఫ్యామిలీ అందరితో కలిసి థియేటర్స్‌లో చాలా ఎంజాయ్ చేయొచ్చు.





# ఐఫీస్ట్ లా 'జింగ్ చా..'

పాన్ ఇండియా స్థాయిలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా ల్లో 'థగ్ లైఫ్' ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇండియన్ సినిమాలో రెండు పవర్ హౌసెస్ ఉలగనాయగన్ కమల్ హాసన్, విజనరీ డైరెక్టర్ మణిరత్నం మూడున్నర దశాబ్దాల తరువాత ఈ సినిమాతో మళ్లీ కలసి రావడం విశేషం. వీరి కాంబినేషన్ లో వచ్చిన లెజెండరీ మూవీ నాయకుడు భారత చలనచిత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది. అందుకే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. మాఫియా గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే ఈ కథలో ఇంటెన్స్ డ్రామా, ఎమోషన్స్ తో నిండిన కథనాన్ని 'థగ్ లైఫ్' అందించబోతోంది. ఈ ఉత్సాహానికి మరింత ఊపునిచ్చే అంశం హీరో సింబు కీలక పాత్రలో కనిపించనున్నాడు.ఈ చిత్రంలో త్రిషా కృష్ణన్, సాన్యా మల్హోత్రా, అశోక్ సెల్వన్, అభిరామి, ఐశ్వర్య లక్ష్మి, జోజు జార్జ్ ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రంలోని ఫస్ట్ సాంగ్ 'జింగుచా' వెడ్డింగ్ యాంథమ్‌గా అదరగొట్టింది. రెహమాన్ తన ప్రత్యేక శైలిలో ఆధునిక బాణీలతో ఈ పాటను అద్భుతంగా మలిచారు. మంగ్లీ, శ్రీకృష్ణ, ఆశిమా మహాజన్, వైశాలి సామంత్ ఫ్లజెంట్ వోకల్స్ తో పాటకు ప్రాణం పోశారు. అనంత శ్రీరామ్ రాసిన లిరిక్స్ పాటకి పండుగ వాతావరణాన్ని ఇచ్చాయి. ఇది శబ్దాల, నృత్యాల, సాంస్కృతిక ఉత్సవంగా నిలుస్తోంది. సాంగ్ విజువల్‌గా ఐఫీస్ట్‌లా వుంది. కమల్ హాసన్ తన ప్రజెన్స్‌తో కట్టిపడేశారు, సాన్యా మల్హోత్రా ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో అద్భుతంగా మెప్పించింది. సింబు, త్రిష, ఇతర నటులు కూడా పాటను మరో స్థాయికి తీసుకెళ్ళారు. ఈ సినిమాను కమల్ హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ ఆనంద్ కలిసి రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు. ఉదయనిధి స్టాలిన్ రెడ్ జైయింట్ మూవీస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. శ్రేష్ఠ్ మూవీస్ (ఎన్ సుధాకర్ రెడ్డి) ద్వారా ఈ సినిమా తెలుగులో గ్రాండ్‌గా విడుదలవుతుంది. సినిమా జూన్ 5న విడుదల కానుంది.

## సూర్యకు మూడు వైపులా స్ట్రోకులు



ఫ్లాపుల పరంపరకు బ్రేక్ వేస్తూ తనకో బ్లాక్ బస్టర్ ఇస్తాడని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ మీద సూర్య పెట్టుకున్న నమ్మకం ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. ఇంత బ్యాడ్ టాక్ తోనూ నిన్న వీకెండ్ బుక్ మై షోలో ఎనభై వేల టికెట్లు అమ్ముడుపోవడం విశేషం. ఒకవేళ యునానిమస్ టాక్ వచ్చి ఉంటే ఆకాశమే హద్దుగా రికార్డులు బద్దలయ్యేవని తెగ ఫీలవుతున్నారు. మొదటి అరగంట మినహాయించి రెట్రోలో చెప్పుకోదగ్గ విశేషం లేకపోవడం కామన్ ఆడియన్స్ ని దూరం చేసింది. ముఖ్యంగా తెలుగు, మలయాళ, కన్నడ ప్రేక్షకుల సహనానికి పెద్ద పరీక్ష పెట్టింది.కంటెంట్ సంగతి పక్కనపెడితే సూర్యకు బాక్సాఫీస్ వద్ద పోటీ రూపంలో ఎదురైన మూడు దెబ్బలు వసూళ్ల మీద తీవ్ర ప్రభావం చూపించాయి. తెలుగులో హిట్ 3 ది థర్డ్ కేస్ ఇచ్చిన స్ట్రోక్ మామూలుది కాదు. నాని వయొలెంట్ మాస్ ముందు రెట్రో పూర్తిగా తేలిపోయింది. రెట్రోకి పెద్ద డిస్ట్రిబ్యూషన్ అండ దొరికింది కాబట్టి స్క్రీన్లు హోల్డ్ చేశారు కానీ జనాన్ని ఫుల్ చేయడం కష్టమైపోయింది. అటు కేరళలో మోహన్ లాల్ తుడరుమ్ దెబ్బకు రెట్రో తలకిందులైపోయింది. వంద కోట్లు దాటేసిన ఈ క్రైమ్ థ్రిల్లర్ ఇప్పుడప్పుడే నెమ్మదించేలా లేదు. దీని వల్ల కర్ణాటక నెంబర్లు సైతం సూర్యకు ఆశించిన స్థాయిలో రావడం లేదు. ఇక స్వంత కోలీవుడ్ సంగతి చూస్తే చిన్న సినిమాగా వచ్చి సునామిగా మారిన టూరిస్ట్ ఫ్యామిలీ జనాన్ని కట్టిపడేస్తోంది. మన దగ్గర డబ్బింగ్ చేయలేదు కానీ తమిళనాడులో క్లాసు మాస్ తేడా లేకుండా అందరినీ ఆకట్టుకుంటోంది.

## ఎఫ్1 వీకెండ్ మియామిలో రానా సందడి



మియామి ఎఫ్1 వీకెండ్ ఈసారి ఒక దేశీ ట్విస్ట్ తో మరింత సంచలనం రేపింది. ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి, తన లోకా లోకా టకీలా టీంతో కలిసి నగరంలోని అత్యంత ఎక్స్‌క్లూజివ్ పార్టీల్లో సందడి చేస్తూ కనిపించారు. హాలీవుడ్ గ్లామర్, హిప్‌హాప్ స్టార్‌లు, ఇండియన్ స్టైల్ లో ఈ వేడుకలో 50 సెంట్స్, ఫ్లో రిడా, ఆస్కార్ విజేత క్యూబా గూడిరగ్ జూనియర్‌లు రానా, అతని టీంతో కలిసి సందడి చేశారు. ఈ జోష్ మియామి నగరమంతా చర్చగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా తన విజన్‌కి పేరుపొందిన రానా, ఈ వేడుకలో తన భాగస్వాములు అయిన ఇండియన్ మ్యూజిక్ స్టార్ అనిరుధ్, సీరియల్ ఎంటర్‌ప్రెన్యూర్ శ్రీ హర్ష వడ్లమూడితో కలిసి తమ ప్రీమియమ్ టకీలా బ్రాండ్ అయిన లోకా లోకాను ప్రమోట్ చేస్తున్నారు. ఎఫ్1 మియామి గ్రాండ్ ప్రిక్స్‌కు ప్రపంచం నలుమూలల నుండి సెలబ్రిటీలు, రేసింగ్ స్టార్లు వచ్చి చేరగా, లోకా లోకా పార్టీ హైప్రొఫైల్ నెట్‌వర్కింగ్ కి స్టేజ్ గా నిలిచింది. ఫొటోలు, వీడియోల్లో రానా లైట్ మూడ్‌లో కనిపించగా, క్యూబా గూడిరగ్ జూనియర్‌తో నవ్వులు పంచుకున్నారు, అలాగే 50 సెంట్స్‌తో బ్యాక్‌స్టేజ్‌లో కలిసాడు ఇంతలో 50 సెంట్స్ తన స్ట్రజ్ పెర్ఫార్మెన్స్‌తో సందడిని మరింత పెంచాడు. ఇది ఇండియన్ ట్యాలెంట్, అమెరికన్ స్టైలుతో కలసిన ఒక స్టైలిష్ కలయికగా మారింది.

## శుభం దర్శకుడి కాన్ఫిడెన్స్ వేరే లెవల్



మే 9 విడుదల కాబోతున్న సినిమాల్లో సమంత నిర్మించిన శుభం ఉంది. ప్రొడ్యూసర్ గా వ్యవహరించడమే కాదు ఒక క్యామియో కూడా చేసింది. నెట్ ఫ్లిక్స్ లో వచ్చిన సినిమాబండితో పేరు తెచ్చుకున్న ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించగా అంతా కొత్త క్యాస్టింగ్ లో తక్కువ బడ్జెట్ లో నిర్మించారు. ఇవాళ జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ లో ప్రవీణ్ స్టేట్ మెంట్లు చూసి మీడియా సైతం ఆశ్చర్యపోయింది. ఎవరైనా తమ చిత్రం రిలీజ్ కు ముందు గొప్పలు చెప్పుకోవడం సహజం. దానికి చిన్నా పెద్దా తేడా ఉండదు. వర్కౌట్ అయితే ఒకే. కాకపోతే కొన్నిసార్లు అవి మరీ ఓవర్ కాన్ఫిడెంట్ గా అనిపిస్తేనే ఇబ్బందులు తలెత్తుతాయి. ప్రవీణ్ మాట్లాడుతూ ఇప్పటిదాకా తెలుగు ఇలాంటి కంటెంట్ రాలేదని, చూసిన ప్రతి ఒక్కరు ఖచ్చితంగా కన్నీళ్లు పెట్టుకుంటారని, అప్పట్లో జంబలకిడిపంబ చూశామని, కానీ ఇలాంటి హారర్ కామెడీని తెలుగు ప్రేక్షకులు మొదటిసారి అనుభూతి చెందుతారని పెద్ద ప్రామిస్ చేసేశాడు. అంతే కాదు శుభం మార్నింగ్ షో చూసేవాళ్ళు చాలా లక్కీ అని, తర్వాత టాక్ స్ప్రెడ్ అయిపోయి శని ఆదివారాలు అందరూ ఏందిరా ఈ సినిమాని మాట్లాడుకుంటారని, వైజాగ్ గడ్డ మీద ప్రమాణం చేస్తున్నానని బాగా ఎగ్జైట్ అయిపోయాడు. ఇదంతా చూస్తున్న సమంత మొహంలో ఆశ్చర్యం, ఆనందం రెండూ కనిపించాయి. శుభం బ్లాక్ బస్టర్ అయితే ఇదే స్పీచ్ కు విలువ పెరుగుతుంది. లేదంటే కేవలం వైరల్ కావాలనే ఉద్దేశంతోనే ఇలా మాట్లాడాడనే క్లారిటీ వస్తుంది. ఏది తేలాలన్నా ఇంకో అయిదు రోజులు ఆగాల్సిందే. హిట్ 3 ది థర్డ్ కేస్ దూకుడు వీక్ డేస్ లో తగ్గే సూచనలు ఉండటంతో శ్రీ విష్ణు సింగిల్ తో పాటు సమంతా శుభంకు మంచి ఛాన్స్ దక్కనుంది. పాజిటివ్ టాక్ తెచ్చుకుంటే జనాన్ని థియేటర్లకు వచ్చేలా చేయొచ్చు. మజిలీ, రంగస్థలంలాగే శుభం ఈవెంట్ కూడా విశాఖపట్నంలో జరుగుతోంది కాబట్టి మరోసారి తనకు బ్లాక్ బస్టర్ ఇస్తారనే నమ్మకాన్ని స్టేజి మీద సమంతా వ్యక్తం చేయడం కొసమెరుపు.




## మిల్క్ బ్యూటీ తమన్నా లేటెస్ట్ పోస్ట్..

**టాలీవుడ్ హీరోయిన్ తమన్నా భాటియా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అక్కర్లేదు. ఈ బ్యూటీ అనేక చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల మనసు దోచేసింది. ఈమె అద్భుతంగా నటించి.. జనాల్ని మెప్పించింది. ఇటీవలే ఈ హీరోయిన్ నటించిన ఓదెల -2 సినిమాలో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ మూవీ నుంచి విడుదలైన పోస్టర్లు, టీజరే జనాల్లో విపరీతమైన హైప్ పెంచాయి. ఇక సినిమా విడుదలయ్యాక ఓదెల 2 బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది. బాక్సాఫీసు వద్ద వసూళ్ల వర్షం కురిపించిందని చెప్పకోవచ్చు. ఈ మూవీలో తమన్నా భాటియా ప్రధాన పాత్రలో నటించి మెప్పించింది. ఈ చిత్రానికి అశోక్ తేజ దర్శకత్వం వహించారు. అలాగే ఈ సినిమాకు సంపత్ నంది రచయిగా వ్యవహరించారు. హెబ్బా పటేల్, వశిష్ట, ఎన్ సింహ ప్రధాన పాత్రలో నటించారు. ఈ మూవీలో మిల్క్ బ్యూటీ తమన్నా నాగసాధువుగా కనిపించింది. ఇకపోతే ఈ ముద్దుగుమ్మ ఓ వైపు సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ.. సోషల్ మీడియాలోని అభిమానులతో టచ్‌లో ఉంటుంది. తాజాగా ఈ మిల్క్ బ్యూటీ నెట్టింట ఓ పోస్ట్ పెట్టింది. స్టైలిష్ డ్రెస్ ధరించి.. స్టన్నింగ్ స్టిల్స్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పిక్స్ వీక్షించిన నెటిజన్లు లుకింగ్ హార్డ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.**

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక








# ప్లే ఆఫ్స్ రేసు నుంచి ఔట్





ఐపీఎల్ 2024లో ఫైనల్‌లో ఓడి రన్నరప్‌గా నిలిచిన సన్ రైజర్స్ హైదరాబాద్.. ఐపీఎల్ 2025 సీజన్ నుంచి నిష్క్రమించింది. సోమవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా ఫలితం తేలకుండానే ముగిసింది. దీంతో ప్లే ఆఫ్స్ రేసు నుంచి ఎస్‌ఆర్‌హెచ్ తప్పుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు మాత్రం ఈ వర్షంతో కలిసొచ్చింది.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 ప్లే ఆఫ్స్ రేసు నుంచి సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు నిష్క్రమించింది. సోమవారం హైదరాబాద్‌లోని ఉప్పల్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా ఫలితం తేలకుండానే రద్దు అయింది. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు బ్యాటింగ్ చేశాక మొదలైన వాన ఎంతకూ తగ్గలేదు. దీంతో మ్యాచ్ రద్దు అయినట్లు అంపైర్లు ప్రకటించారు. ఇరు జట్లకూ చెరో పాయింట్ కేటాయించారు.

కాగా ఈ మ్యాచులో సన్ రైజర్స్ హైదరాబాద్ మెరుగైన ప్రదర్శన చేసింది. తొలుత ఢిల్లీ క్యాపిటల్స్‌కు బ్యాటింగ్ అప్పగించి కేవలం 133/7 పరుగులకే పరిమితం చేసింది. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మూడు వికెట్లు తీసి.. ఢిల్లీ క్యాపిటల్స్ పతనాన్ని శాసించాడు. దీంతో సన్ రైజర్స్ హైదరాబాద్.. ఈ మ్యాచులో ఈజీగానే గెలిచేలా కనిపించింది. హిట్టర్లతో నిండిన హైదరాబాద్.. వీలైనంత త్వరగా మ్యాచును ముగించి.. కీలకమైన 2 పాయింట్లతో పాటు నెట్ రన్ రేట్‌ను భారీగా పెంచుకుంటుందని ఫ్యాన్స్ ఆశపడ్డారు.

కానీ సన్ రైజర్స్ హైదరాబాద్ ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు. ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్ ముగిశాక వర్షం మొదలైంది. ఆ తర్వాత ఎంతకూ వర్షం తగ్గలేదు. దీంతో మ్యాచును రద్దు చేసినట్లు అంపైర్లు ప్రకటించారు. కాగా ఐపీఎల్ 2025లో వర్షం కారణంగా మ్యాచ్ ఫలితం రాకపోవడం ఇది రెండోసారి. ఇదివరకే పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ కూడా రద్దు అయింది. దీంతో రెండు జట్లకూ చెరో పాయింట్ కేటాయించారు.

ఈ ఫలితంతో సన్ రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. 11మ్యాచులలో కేవలం మూడింట్లో మాత్రమే గెలిచిన ఆ జట్టు.. మిగతా మూడు మ్యాచులో గెలిచినా.. కేవలం 13 పాయింట్లు మాత్రమే అవుతాయి. ఇప్పటికే నాలుగు జట్లు 14 పాయింట్లు సాధించడంతో సన్ రైజర్స్ పోరాటం ముగిసినట్లయింది. ఈ ఫలితంతో ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్స్ టేబుల్‌లో ఐదో స్థానానికి చేరింది.



## మహ్మద్ షమీకి హత్య బెదిరింపులు

టీమిండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీకి హత్య బెదిరింపులు రావడం ప్రస్తుతం సంచలనంగా మారింది. షమీని హత్య చేస్తామంటూ బెదిరింపు మెయిల్ వచ్చిందని అతని సోదరుడు హసీబ్ వెల్లడించాడు. అంతేకాకుండా కోటి రూపాయలు డిమాండ్ చేసినట్లు హసీబ్ తెలిపాడు. ఈ ఘటనపై షమీ సోదరుడు ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సోమవారం ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపడతున్నారు. పోలీసులు తమ ప్రాథమిక దర్యాప్తులో రాజ్‌పుత్ సిందార్ అనే వ్యక్తి ఈ బెదిరింపు ఇమెయిల్ పంపినట్లు గుర్తించారు. కాగా ఇటీవల టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు కూడా ఇటువంటి బెదిరింపులే వచ్చాయి. ఈ మెరకు ఢిల్లీ పోలీసులకు గంభీర్ ఫిర్యాదు చేశాడు. కాగా మహ్మద్ షమీ ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడుతున్నాడు. గాయం నుంచి కోలుకుని ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో పర్వాలేదన్పించిన షమీ.. ఐపీఎల్‌లో మాత్రం తేలిపోతున్నాడు. షమీ ఇప్పటివరకు 9 మ్యాచ్‌ల్లో 56.17 సగటుతో 6 వికెట్లు మాత్రమే పడగొట్టాడు. ఇంగ్లండ్‌తో జరగనున్న టెస్టు సిరీస్‌లో షమీ భారత తరపున ఆడనున్నాడు.

## ఆర్ ఆర్ పరాజయం తరువాత కుంగిపోయిన ద్రావిడ్ వీడియో వైరల్!



ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ కేవలం ఒక పరుగు తేడాతో కోల్‌కతా నైట్ రైడర్స్ చేతిలో ఓడిపోయింది. కెప్టెన్ రియాన్ పరాగ్ 95 పరుగులతో మెరిసినా, మిగిలిన ఆటగాళ్లు పూర్తిగా మద్దతివ్వకపోవడం ఓటమికి దారితీసింది. కోచ్ రాహుల్ ద్రవిడ్ తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు వరుసగా చోటుచేసుకుంటున్న నేపథ్యంలో, నిన్న ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు కేవలం ఒక పరుగు తేడాతో డిఫెండిరగ్ ఛాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్ చేతిలో ఓటమి పాలైంది. ఈ మ్యాచ్‌లో 207 పరుగుల భారీ లక్ష్యాన్ని చేధించేందుకు మైదానంలో దిగిన రాయల్స్, కెప్టెన్ రియాన్ పరాగ్ అద్భుతమైన ప్రదర్శనతో 45 బంతుల్లో 95 పరుగులు చేసి, మ్యాచ్‌ను చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా మార్చాడు. అయితే చివరకు వారి స్కోరు 20 ఓవర్లలో 205/8కి పరిమితమై ఒక పరుగు తేడాతో పరాజయం చవిచూసింది. ఈ ఓటమి కారణంగా రాజస్థాన్ రాయల్స్ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ తీవ్ర నిరాశకు లోనయ్యాడు. మ్యాచ్ సమయంలో డగౌట్‌లో ఉండే ద్రవిడ్ ఎప్పటిలాగానే శాంతంగా కనిపించినా, చివరికి ఓటమి తాలూకు బాధను తట్టుకోలేకపోయాడు. మ్యాచ్ వివరాల్లోకి వెళితే, మొదట బ్యాటింగ్ చేసిన ఖఖR 20 ఓవర్లలో 206 పరుగులు చేసింది. ఈ స్కోరులో ఆండ్రీ రస్సెల్ 25 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఆరు సిక్సర్లతో అజేయంగా 57 పరుగులు చేయడం, రింకు సింగ్ చివర్లో ఆరు బంతుల్లో 19 పరుగులు చేయడం కీలక పాత్ర పోషించాయి. అలాగే అంగ్క్రిష్ రఘువంశీ 44, రహ్మానుల్లా గుర్బాజ్ 35 పరుగులు చేయడంతో ఖఖR భారీ స్కోరును నమోదు చేయగలిగింది. ఛాజింగ్ లో రాజస్థాన్ రాయల్స్ మొదట్లో రెండు వికెట్లు త్వరగా కోల్పోయింది. ఆపై మిడిల్ ఓవర్లలో వరుసగా మూడు వికెట్లు పడిపోవడంతో దళం తీవ్ర ఒత్తిడిలో పడిరది. కానీ కెప్టెన్ పరాగ్ ధైర్యంగా ఎదుర్కొంటూ అద్భుతంగా బాదాడు. ఒక దశలో అతను వరుసగా ఆరు సిక్సర్లు బాది స్టేడియాన్ని హోరెత్తించాడు. చివర్లో హెట్మెయర్, జోఫ్రా ఆర్చర్, శుభమ్ దూబే వంటి బ్యాటర్లు కలిసి మ్యాచ్‌ను గెలిచే స్థితికి తీసుకొచ్చారు. అయితే, ఖఖR బౌలర్లలో స్పిన్నర్లు మోయిన్ అలీ, వరుణ్ చక్రవర్తి, పేసర్లు హర్షిత్ రాణా, వైభవ్ అరోరా కట్టుదిట్టమైన బౌలింగ్‌తో రాయల్‌స్‌కు మ్యాచ్‌ను చేజార్చారు. ఈ ఓటమితో రాజస్థాన్ రాయల్స్ పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని కోల్పోయింది. ప్రస్తుతం వారు మూడే విజయాలతో, తొమ్మిది ఓటములతో ఉన్నారు. తమ తదుపరి మ్యాచ్‌ను చెన్నైలో మే 12న చెన్నై సూపర్ కింగ్‌స్‌తో తలపడనున్నారు. ఈ మ్యాచ్ వారి గౌరవ రక్షణగా నిలవనుంది.

## సీఎస్‌కే జట్టులోకి ఫాస్టెస్ట్ సెంచరీ వీరుడు..



ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రయాణం ముగిసిన సంగతి తెలిసిందే. వరుస ఓటములతో మరో మూడు మ్యాచ్‌లు మిగిలూండగానే ప్లే ఆఫ్స్ రేసు నుంచి సీఎస్‌కే నిష్క్రమించింది. అయితే మిగిలిన మూడు మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి తమ పరువు కాపాడుకోవాలని సీఎస్‌కే భావిస్తోంది. సీఎస్‌కే తమ తదుపరి మ్యాచ్‌లో మే 7న ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్‌స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌కు ముందు చెన్నై సూపర్ కింగ్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీకి చెందిన 22 ఏళ్ల అన్‌క్యాప్డ్ వికెట్ కీపర్‌బ్యాటర్ వన్ష్ బేడీ చీలమండ గాయం కారణంగా మిగిలిన సీజన్‌కు దూరమయ్యాడు. అతడి స్థానంలో బరోడా బ్యాటర్ ఉర్విల్ పటేల్‌ను చెన్నై తమ జట్టులోకి తీసుకుంది. "ఎడమ చీలమండ గాయం కారణంగా టోర్నమెంట్‌లోని మిగిలిన మ్యాచ్‌లకు వన్ష్ బేడీ దూరమయ్యాడు. అతడి స్థానంలో చెన్నై సూపర్ కింగ్స్ (CSK) ఉర్విల్ పటేల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది" అని ఐపీఎల్ వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. అతడి స్థానంలో బరోడా బ్యాటర్ ఉర్విల్ పటేల్‌ను చెన్నై తమ జట్టులోకి తీసుకుంది. "ఎడమ చీలమండ గాయం కారణంగా టోర్నమెంట్‌లోని మిగిలిన మ్యాచ్‌లకు వన్ష్ బేడీ దూరమయ్యాడు. అతడి స్థానంలో చెన్నై సూపర్ కింగ్స్ (CSK) ఉర్విల్ పటేల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది" అని ఐపీఎల్ వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. 26 ఏళ్ల ఉర్విల్ పటేల్‌కు టీ20 క్రికెట్‌లో అద్భుతమైన రికార్డు ఉంది. గతేడాది సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఉర్విల్ పటేల్ విధ్వంసం సృష్టించాడు. త్రిపురపై కేవలం 28 బంతుల్లోనే సెంచరీ చేసి పటేల్ చరిత్ర సృష్టించాడు. టీ20 ఫార్మాట్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన భారత ఆటగాడిగా రిషబ్ పంత్ రికార్డును ఉర్విల్ బద్దలు కొట్టాడు. అదే టోర్నీలో ఉత్తరాఖండ్‌పై కూడా 36 బంతుల్లో సెంచరీ సాధించాడు. ఈ క్రమంలోనే ఉర్విల్ పటేల్‌తో సీఎస్‌కే ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటివరకు ఉర్విల్.. 47 టీ20 మ్యాచ్‌లు ఆడి 170 స్ట్రైక్ రేట్‌తో 1162 పరుగులు చేశాడు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in